# రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 12 | బుధవారం | 26.08.2026 | పేజీలు : 8 | వెల రూ. 2

Medchal Malkajgiri | Volume: 1 | Issue: 12 | Wednesday | 26.08.2026 | Pages: 8 | Rate: 2





## అతడు సైకో కాదు.. సాదిక్ ఖాన్..!

### లవ్ జిహాద్‌కి బలైపోయిన బీసీ కుటుంబం

**సౌజన్య జీవితాన్ని చిన్నాభిన్నం చేసిన జిహాద్ ముఠా**

ఒక చిన్న పరిచయం.. ఆ తర్వాత పెరిగిన సాన్నిహిత్యం.. చివరకు నాలుగు ప్రాణాలను బలిగొన్న విషాదం. రైఫిల్ షూటింగ్ అకాడమీలో మొదలైన సౌజన్య–సాధిక్ పరిచయం ఇంతటి దారుణానికి ఎలా దారితీసింది? అండగా నిలిచిన వ్యక్తే జీవితాన్ని చుట్టుముట్టేంతగా ఎలా ప్రభావం చూపాడు? ప్రేమా.. బ్లాక్‌మెయిలా.. ఆస్తుల కోసమే వేసిన వలనా? భర్త జగదీశ్వరరెడ్డి మరణంపై అనుమానాలు ఎందుకొచ్చాయి? సౌజన్యపై మతమార్పిడి ఒత్తిడి వచ్చిందన్న ఆరోపణల్లో నిజమెంత? చివరకు నూకరాజు కుటుంబం గోదావరిలోకి ఎందుకు దూకాల్సి వచ్చింది? సాధిక్ అరెస్టుతో కేసు ముగిసిందనుకుంటే.. అసలు ప్రశ్నలు ఇప్పుడు మొదలయ్యాయి. ఆస్తులు, బ్యాంకు ఖాతాలు, ఫోన్ డేటా, బెదిరింపులు, మతమార్పిడి ఆరోపణలు.. ఒక్కో అంశం వెనుక మరో అనుమానం వెంటాడుతోంది. దీనికి 'లవ్ జిహాద్' రంగు పులుముతున్న రాజకీయ ఆరోపణలు మరింత కలకలం రేపుతున్నాయి. అయితే ఆరోపణలు వేరు.. ఆధారాలు వేరు. అసలు ఈ విషాదం వెనుక నిజం ఏమిటి? ఎవరి పాత్ర ఎంత? ఏది నేరం.. ఏది రాజకీయ ప్రచారం? ఇప్పుడు ఆధారాలే తేల్చాల్సిన అసలు కథ ఇదే.

## వెలుగులోకి సాధిక్ దురాగతాలు

**కోచ్ వేధింపులు.. బాలుడి కన్నీటి గాథ!**

**భయం3తో బతుకుతున్న పదేళ్ల బాలుడు**

రైఫిల్ షూటింగ్ నేర్చుకోవాలన్న చిన్నారి కల.. కుటుంబ విషాదంతో కన్నీటి కథగా మారింది. ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య ఘటనలో ప్రాణాలతో బయటపడిన పదేళ్ల రియాన్ష్ కార్తికేయరెడ్డి చేసిన ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. తన కుటుంబాన్ని నాశనం చేసి, తనను అనాథగా మార్చారని బాలుడు ఆవేదన వ్యక్తం చేశాడు. చిన్నప్పటి నుంచే రైఫిల్ షూటింగ్‌పై ఆసక్తితో సాధిక్‌ఖాన్ వద్ద పరిచయం ఏర్పడిందని చెప్పాడు. ఆ పరిచయం తర్వాత తన తల్లికి కూడా సాధిక్ దగ్గరయ్యాడని, ఆమెను వేధించినట్లు ఆరోపించాడు.

(వివరాలు 2లో..)





## మూసీ భూసేకరణకు వేగం పెంచండి

**»న్యాయ చిక్కులు లేకుండా చూసుకోండి**

**»అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచన**

మూసీ ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన సమీక్షలో ప్రాజెక్టు పురోగతిపై పలు కీలక సూచనలు చేశారు. ముఖ్యంగా భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు ల్యాండ్ పూలింగ్‌పై స్పష్టమైనవిధానంరూపొందించాలనిసూచించారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, అసైన్డ్ భూముల సేకరణకు ప్రత్యేక విధానం ఉండాలని చెప్పారు. భూసేకరణ సమయంలో ఎలాంటి న్యాయపరమైన వివాదాలు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మూసీ ప్రాజెక్టు ఫేజ్ 2కు సంబంధించిన టెండర్లను వీలైనంత త్వరగా పిలవాలని ఆదేశించారు. ప్రాజెక్టులకు తక్కువ వడ్డీతో రుణాలు లభించే అవకాశాలను మునిసిపల్ కమిషనర్లు పరిశీలించాలని సూచించారు. పనుల్లో ఆలస్యం లేకుండా నిర్ణీత గడువులోగా ప్రాజెక్టులను పూర్తి చేయాలని సీఎం స్పష్టం చేశారు. (2లో..)



## హిజాబ్ మతపరమైన హక్కు కాదు

**అలహాబాద్ హైకోర్టు సంచలన తీర్పు**

**పాఠశాలల్లో యూనిఫామ్‌కే ప్రాధాన్యం**

ముస్లిం మహిళలు ధరించే హెడ్‌స్కార్ఫ్ ఇస్లాంలో అత్యవసర మతాచారం అని నిరూపితం కాలేదని అలహాబాద్ హైకోర్టు స్పష్టం చేసింది. ప్రయాగ్‌రాజ్‌లోని టాగోర్ పబ్లిక్ స్కూల్‌లో 11వ తరగతి చదువుతున్న ఓ ముస్లిం విద్యార్థిని, నిర్దేశించిన యూనిఫామ్‌తో పాటు హిజాబ్ ధరించేందుకు అనుమతి కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. జస్టిస్ జె.జె. మునీర్, జస్టిస్ ఇంద్రజీత్ శుక్లాతో కూడిన ధర్మాసనం ఆగస్టు 21న ఈ ఉత్తర్వులు జారీ చేసింది. (3లో..)




## యూపీలో ఫ్రీ బస్ స్కీమ్

**ఎన్నికల వేళ యోగి సర్కార్ నిర్ణయం**

**60 ఏళ్ల మహిళలకు బంపర్ గిఫ్ట్**

**జీవితాంతం ఉచిత బస్సు ప్రయాణం**

ఉత్తరప్రదేశ్‌లో సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం మహిళలకు కీలక నిర్ణయం తీసుకుంది. 60 ఏళ్లు పైబడిన మహిళలకు జీవితాంతం ఉచిత బస్సు ప్రయాణం కల్పించే లోక్‌మాత అహిల్యాబాయి మాతృశక్తి యోజనకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మంగళవారం జరిగిన కేబినెట్ సమావేశంలో మొత్తం 24 ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. (3లో..)

## జెన్‌జీని తక్కువ అంచనా వేయొద్దు!

**రేవంత్, పొంగులేటిలకు రియల్ ఎస్టేట్ తెలుసు మాకు ప్రజల కోసం పోరాటాలు చేయడం తెలుసు**

22 ఏ భూముల పరిష్కారానికి సెప్టెంబర్ 7 డెడ్‌లైన్

లేకుంటే లక్షలాది మందితో అసెంబ్లీ ముట్టడిస్తాం

సర్కారుకు హరీశ్ రావు వార్నింగ్

### జీవో 97పై హరీశ్ రావు ఫైర్

తెలంగాణలో పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళనపై బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. 20 రోజులుగా విద్యార్థులు జీవో 97 రద్దు కోసం పోరాడుతున్నారని, వారి ఆందోళనకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. మాసబ్‌ట్యాంక్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులను కలిసిన హరీశ్‌రావు.. పాలిటెక్నిక్ కళాశాలలను ఐటీఐలతో కలిపి స్కిల్ యూనివర్సిటీకి అప్పగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. (వివరాలు 2లో..)





## సురేఖ, చిన్నారెడ్డిపై వేటు?

### కాంగ్రెస్‌లో రెండు వికెట్లు ఔట్

**క్రమశిక్షణ కమిటీ కీలక నివేదిక**

తెలంగాణ కాంగ్రెస్‌లో ఇద్దరు కీలక నేతలపై క్రమశిక్షణ చర్యల అంశం ఇప్పుడు తీవ్ర రాజకీయ చర్చకు దారితీసింది. మంత్రి కొండా సురేఖ, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి వ్యవహారంపై క్రమశిక్షణ కమిటీ రూపొందించిన నివేదికను టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌కు అందజేసింది. ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కమిటీ ఛైర్మన్ మల్లు రవి, వైస్ ఛైర్మన్ శ్యామ్ మోహన్ కలిసి ఈ నివేదికను అందించారు. (వివరాలు 2లో..)

## సీఎం రేవంత్ రెడ్డి అమెరికా టూర్

**అనుమతులపై కిషన్ రెడ్డి క్లారిటీ**

అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించడంపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు. రాజకీయ కారణాలతో పర్యటనను అడ్డుకున్నారన్న ఆరోపణలు అర్థరహితమని కొట్టిపారేశారు. ముఖ్యమంత్రుల విదేశీ పర్యటనలకు సంబంధించి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి అమల్లో ఉన్న నిబంధనల ప్రకారమే కేంద్ర విదేశాంగ శాఖ నిర్ణయాలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. (2లో..)






## తెలంగాణ మోడల్‌తో కులాల లెక్కింపు

**ప్రశ్నావళిపై రాహుల్, ఖర్గే అభ్యంతరం**

జనగణనలో కులగణన విధానం సరిగా లేదని కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ అంశంపై ప్రధాని నరేంద్ర మోదీకి మంగళవారం ఇద్దరూ సుదీర్ఘ లేఖ రాశారు. కులగణనలో తెలంగాణ మోడల్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కులాల నమోదుకు కేంద్రం ప్రతిపాదించిన 'ఓపెన్ ఎండెడ్' విధానం గందరగోళానికి దారితీస్తుందని పేర్కొన్నారు.

# ఫీజు బకాయిలపై బీజేపీ పోరు

వివరాలు 2లో..

### ముగిసిన రెండు రోజుల దీక్ష

తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై బీజేపీ చేపట్టిన పోరాటంలో భాగంగా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు చేపట్టిన రెండు రోజుల నిరాహార దీక్ష ముగిసింది. దాదాపు 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని బీజేపీ ఆరోపించింది. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా 'ఫీజుల బకాయి-బీజేపీ లడాయి' పేరుతో ఈ దీక్ష కొనసాగింది. విద్యార్థుల చదువులకు ఇబ్బందులు రాకుండా వెంటనే బకాయిలు విడుదల చేయాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. రాంచందర్‌రావు చేపట్టిన దీక్షను రాజ్యసభ సభ్యుడు డా. కె. లక్ష్మణ్, తెలంగాణ బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విద్యార్థులతో కలిసి నిమ్మరసం అందించి విరమింపజేశారు. ఫీజు బకాయిలు పూర్తిగా చెల్లించే వరకు విద్యార్థుల తరపున పోరాటం కొనసాగిస్తామని బీజేపీ నేతలు స్పష్టం చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు తదుపరి కార్యాచరణను ప్రకటించనున్నట్లు తెలిపారు.





## ఏడాదిలో దేవాదుల పూర్తి

### రైతులకు నీరందించడమే లక్ష్యం

**మంత్రి ఉత్తమ్, పొంగులేటి రివ్యూ**

దేవాదుల ప్రాజెక్టును ఏడాదిలోగా వందశాతం పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జలసౌధలో జరిగిన సమీక్షలో దేవాదుల ప్రాజెక్టు పనుల పురోగతిపై చర్చించారు. ప్రాజెక్టు ప్రారంభం నుంచి ఇప్పటివరకు జరిగిన పనులను సమగ్రంగా పరిశీలించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. (2లో..)



## ₹ 60కి చేరిన ఉల్లి ₹ 70 కి షుగర్

**సామాన్యుడికి ధరల మంట**

**ఉల్లి ధరతో మొదలైన భారం**

జీతం వస్తోంది.. కానీ ఇంటికి సరుకులు తీసుకెళ్లేలోపే జేబు ఖాళీ అవుతోంది. మార్కెట్‌కు వెళ్లిన సామాన్యుడికి ఇప్పుడు ప్రతి వస్తువు ఒక షాక్ ఇస్తోంది. ఉల్లిగడ్డ కిలో రూ.60.. చక్కెర కిలో రూ.70 అంటే నిత్యావసరాల ధరలు ఏ స్థాయికి చేరాయో అర్థం చేసుకోవచ్చు. కూరగాయల ధరలు, పప్పుల ధరలు, వంట నూనె ధరలు ఇలా ఒక్కో సరుకు కుటుంబ బడ్జెట్‌ను తినేస్తోంది. ఒకప్పుడు వారానికి సరిపడా సరుకులు కొనుగోలు చేసేందుకు వెళ్లిన కుటుంబాలు ఇప్పుడు అవసరమైన వాటినే ఎంచుకుని కొనాల్సిన పరిస్థితి. పిల్లలకు ఇష్టమైనవి కొనాలన్నా ఆలోచించాల్సిందే. ఇంట్లో వృద్ధుల అవసరాలు తీర్చాలన్నా లెక్కలు వేసుకోవాల్సిందే. (3లో..)

## ఫీజుల బకాయిలపై ఈటల ఫైర్



**విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలొద్దు**

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల అంశంపై సీఎం రేవంత్‌రెడ్డిపై మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. లక్షలాది మంది పేద విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని ఆరోపించారు. ఫీజులు వస్తాయన్న నమ్మకంతో కూలీలు, ఆటోడ్రైవర్లు, రైతులు, చిరు వ్యాపారులు తమ పిల్లలను కాలేజీల్లో చేర్పించారని, ఇప్పుడు బకాయిలు చెల్లించకపోతే వారి పరిస్థితి ఏంటని ప్రశ్నించారు.

## ఫీజులు లేవు.. విదేశీ విద్య ఎలా?



**విద్యార్థుల కష్టాలపై బండి ఫైర్**

తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా ప్రపంచస్థాయి విద్య అందిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పడం ఎలా సాధ్యమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ప్రశ్నించారు. ఫీజులు అందక కాలేజీలు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నాయని, విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు.




## నకిలీ డిగ్రీలతో వైద్యం

**• ప్రాణాలతో చెలగాటం • నగరంలో ఫేక్ డాక్టర్ దందా**

హైదరాబాద్‌లో వైద్యం పేరుతో జరుగుతున్న మరో మోసం కలకలం రేపుతోంది. డాక్టర్ చదువు లేకపోయినా.. చేతిలో నకిలీ డిగ్రీ ఉంటే చాలు.. క్లినిక్ పెట్టి వైద్యం చేసే స్థాయికి కొందరు మోసగాళ్లు చేరుకున్నారు. ఇతర రాష్ట్రాల్లోని ప్రముఖ విశ్వవిద్యాలయాల పేర్లను ఉపయోగించి నకిలీ సర్టిఫికెట్లు తయారు చేసుకోవడం.. వాటిని నిజమైన విద్యార్హతలుగా చూపించడం..

# మూసీ భూసేకరణకు వేగం పెంచండి

»న్యాయ చిక్కులు లేకుండా చూసుకోండి
»అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచన



**టీడీఆర్‌పై వారానికోసారి సమీక్ష**

మూసీ ప్రాజెక్టుతో పాటు నగర అభివృద్ధికి సంబంధించిన ఇతర అంశాలపైనా సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేశారు. టీడీఆర్ అంశంపై ప్రతి వారం సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు. మంచిరేవుల ఓంకారేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన టెండర్లను వెంటనే పిలవాలని చెప్పారు. కొత్వాల్‌గూడ బర్డ్స్ పార్క్‌కు మరింత ప్రచారం కల్పించి సందర్శకులను ఆకర్షించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రాజెక్టుల పనుల్లో జాప్యం జరిగితే అభివృద్ధి లక్ష్యాలు దెబ్బతింటాయని, అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. హెచ్ఆర్‌డి బోధి పెవిలియన్‌లో జరిగిన ఈ సమీక్షకు సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. మూసీ ప్రాజెక్టుకు భూసేకరణే కీలక దశ కావడంతో ప్రభుత్వం ఇప్పుడు వేగం, న్యాయపరమైన భద్రతపై ప్రధానంగా దృష్టి పెట్టినట్లు సీఎం ఆదేశాలు స్పష్టం చేస్తున్నాయి.

# సీఎం రేవంత్ రెడ్డి అమెరికా టూర్

## అనుమతులపై కిషన్ రెడ్డి క్లారిటీ



అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించడంపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు. రాజకీయ కారణాలతో పర్యటనను అడ్డుకున్నారన్న ఆరోపణలు అర్థరహితమని కొట్టిపారేశారు. ముఖ్యమంత్రుల విదేశీ పర్యటనలకు సంబంధించి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి అమల్లో ఉన్న నిబంధనల ప్రకారమే కేంద్ర విదేశాంగ శాఖ నిర్ణయాలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా విదేశీ పర్యటనకు ఎందుకు ప్రయత్నించారో సీఎం రేవంత్‌రెడ్డి వివరించాలని డిమాండ్ చేశారు. గుజరాత్ ముఖ్యమంత్రికి అమెరికా పర్యటనకు అనుమతి ఇచ్చి తనకు ఇవ్వలేదన్న రేవంత్ వాదన సరైంది కాదన్నారు. గతంలో నరేంద్ర మోదీ గుజరాత్ సీఎంగా ఉన్న సమయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆయన విదేశీ పర్యటనను నిరాకరించిందని గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డికి హార్వర్డ్ బిజినెస్ కోర్సు కోసం కేంద్రం అనుమతి ఇచ్చిందని చెప్పారు. ఇది రాజకీయ నిర్ణయం కాదు.. నిబంధనల ప్రక్రియ మాత్రమే అని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

**మేయర్ మమ్దానీతో భేటీ ఎందుకు?**

రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన ఉద్దేశం ఏంటో కూడా స్పష్టంగా చెప్పాలని కిషన్‌రెడ్డి కోరారు. ముఖ్యంగా న్యూయార్క్ మేయర్ జోహ్రాన్ మమ్దానీతో భేటీ కావాలనుకున్నట్లు వచ్చిన వార్తలపై సీఎం వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మమ్దానీ భారత్‌పై వ్యతిరేక వైఖరి ప్రదర్శించారని, ప్రధాని మోదీపై గతంలో తీవ్ర వ్యాఖ్యలు చేశారని కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. అలాంటి వ్యక్తిని ముఖ్యమంత్రి ఎందుకు కలవాలనుకున్నారో ప్రజలకు వివరించాలని అన్నారు. మరోవైపు తెలంగాణలో జరిగిన కులగణనపైనా కిషన్‌రెడ్డి విమర్శలు చేశారు. హైదరాబాద్‌లో సుమారు 20 శాతం ఇళ్లలో కులగణన జరగలేదని ఆరోపించారు. కులగణన విషయంలో తెలంగాణ ప్రభుత్వం విఫలమైందని అన్నారు. మొత్తం మీద రేవంత్ అమెరికా పర్యటన చుట్టూ రాజకీయ వివాదం కొనసాగుతున్న వేళ.. పర్యటన ఉద్దేశం, మమ్దానీతో భేటీ కారణం, కేంద్ర అనుమతుల అంశంపై సీఎం నుంచి స్పష్టత రావాల్సి ఉందని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

# సురేఖ, చిన్నారెడ్డిపై వేటు?

◆ **కాంగ్రెస్‌లో రెండు వికెట్లు ఔట్**



ఇద్దరు నేతలు ఇచ్చిన వివరణలను పరిశీలించిన తర్వాతే నివేదిక రూపొందించామని మల్లు రవి తెలిపారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించే నేతలపై కఠిన చర్యలు అవసరమని కమిటీ అభిప్రాయపడినట్లు చెప్పారు. పార్టీ ప్రతిష్టకు నష్టం కలిగించే వ్యాఖ్యలు, వ్యవహారశైలిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించకూడదన్న సందేశాన్ని అధిష్ఠానానికి పంపినట్లు తెలుస్తోంది. ఈ నివేదికలో ఇద్దరిపై కఠిన చర్యలకు సిఫార్సులు చేసినట్లు కాంగ్రెస్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

**పదవుల నుంచి తొలగించాలని సిఫార్సు?**

క్రమశిక్షణ కమిటీ నివేదికలో కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తప్పించాలని, చిన్నారెడ్డిని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి నుంచి తొలగించాలని సిఫార్సు చేసినట్లు సమాచారం. సురేఖ వ్యవహారం పార్టీకి ఇది మూడోసారి ఇబ్బందికరంగా మారిందని కమిటీ భావించినట్లు తెలుస్తోంది. ఆమె కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలను సురేఖ బహిరంగంగా ఖండించాల్సిందని కమిటీ అభిప్రాయపడినట్లు సమాచారం. మరోవైపు సీనియర్ నేతగా ఉన్న చిన్నారెడ్డి గతంలో పార్టీలో అనేక బాధ్యతలు నిర్వహించారు. క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్‌గా కూడా పనిచేశారు. అయినప్పటికీ పార్టీకి ఇబ్బంది కలిగించేలా వ్యాఖ్యలు చేశారని కమిటీ అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. వీరిద్దరి వ్యవహారశైలి వల్ల పార్టీతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతిష్ట కూడా దెబ్బతింటోందని నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. అధికారంలో ఉన్న పార్టీ నేతలు హద్దులు దాటితే ప్రజల్లో ప్రతికూల భావన ఏర్పడే ప్రమాదం ఉందని కమిటీ హెచ్చరించినట్లు తెలుస్తోంది.

**అధిష్ఠానం నిర్ణయంపైనే తుది తీర్పు**

నివేదిక సమర్పించిన అనంతరం గాంధీభవన్‌లో మల్లు రవి మీడియాతో మాట్లాడారు. కొండా సురేఖ, చిన్నారెడ్డి ఇచ్చిన వివరణలను పరిశీలించి పీసీసీ అధ్యక్షుడికి నివేదిక అందించామని చెప్పారు. ఈ నివేదికను సీఎం రేవంత్‌రెడ్డికి ఇవ్వలేదని, ఇది పార్టీ అంతర్గత వ్యవహారం కావడంతో పీసీసీ అధ్యక్షుడికే సమర్పించామని స్పష్టం చేశారు. నివేదికలోని అంశాలను ముందుగానే బయటపెడితే తనకే అధిష్ఠానం నుంచి నోటీసులు వచ్చే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు. పార్టీ అంతర్గత విషయాలను బయటకు చెప్పకూడదన్న అంశాన్ని కూడా నివేదికలో ప్రధానంగా పేర్కొన్నట్లు తెలిపారు. కొండా సురేఖ, చిన్నారెడ్డి వ్యక్తిగతంగా కమిటీని కలవలేదని, గాంధీభవన్‌లో తమ వివరణ లేఖలు ఇచ్చి వెళ్లారని చెప్పారు. రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌కు నివేదిక పంపినట్లు, అవసరమైతే ఏఐసీసీ అధ్యక్షుడు, పార్టీ ప్రధాన కార్యదర్శికి కూడా పంపుతామని వెల్లడించారు.

**తుది నిర్ణయం అధిష్ఠానం చేతుల్లో**

కాంగ్రెస్‌లో క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యం ఉందని మల్లు రవి స్పష్టం చేశారు. పార్టీ గౌరవం కాపాడితేనే భవిష్యత్తులో మళ్లీ అధికారంలోకి వచ్చే అవకాశం ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నికలకు ముందు పార్టీకి నష్టం కలిగించేలా నేతలు మాట్లాడకుండా కఠిన హెచ్చరిక అవసరమని చెప్పారు. ఇప్పటికే జరిగిన పరిణామాలు, తాజా వివాదాలు, నేతలు ఇచ్చిన వివరణలను పరిశీలించిన తర్వాతే సమగ్ర నివేదిక ఇచ్చామని తెలిపారు. ఇప్పుడు ఈ నివేదికను కాంగ్రెస్ అధిష్ఠానం పరిశీలించనుంది. కేంద్ర నాయకత్వం తీసుకునే నిర్ణయమే కొండా సురేఖ, చిన్నారెడ్డి రాజకీయ భవిష్యత్తును నిర్ణయించనుంది. పదవుల నుంచి తొలగిస్తారా, హెచ్చరికతో సరిపెడతారా అన్నది ప్రస్తుతం ఉత్కంఠగా మారింది. అయితే క్రమశిక్షణ విషయంలో ఎవరినీ ఉపేక్షించబోమన్న సందేశాన్ని పార్టీ నాయకత్వం ఇవ్వాలనుకుంటున్నట్లు మల్లు రవి వ్యాఖ్యలతో స్పష్టమవుతోంది. దీంతో తెలంగాణ కాంగ్రెస్‌లో ఈ ఇద్దరు నేతలపై ఎలాంటి చర్యలు ఉంటాయన్న అంశం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

# ఫీజులు లేవు.. విదేశీ విద్య ఎలా?

## విద్యార్థుల కష్టాలపై బండి ఫైర్



తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా ప్రపంచస్థాయి విద్య అందిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పడం ఎలా సాధ్యమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ప్రశ్నించారు. ఫీజులు అందక కాలేజీలు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నాయని, విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. లక్షలాది మంది విద్యార్థులు మానసికంగా వేదన పడుతున్నా ప్రభుత్వానికి పట్టడం లేదా అని నిలదీశారు. ముఖ్యంగా దళితులు, గిరిజనులు, బలహీనవర్గాల విద్యార్థులు ఫీజు బకాయిల కారణంగా ఉన్నత విద్యకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫీజు బకాయిలు అడిగిన కాలేజీల యాజమాన్యాలను బెదిరించడం తప్ప ప్రభుత్వం సాధించిందేమీ లేదని విమర్శించారు. ప్రపంచ ప్రఖ్యాత విద్యాసంస్థలను తెలంగాణకు తీసుకొస్తామని చెప్పడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు.

**రూ.15 వేల కోట్ల బకాయిలు చెల్లించాలి**

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ఒకేసారి చెల్లిస్తామని గతంలో ఇచ్చిన హామీ ఏమైందని బండి సంజయ్ ప్రశ్నించారు. తక్షణమే రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజుల సమస్య పరిష్కారం కాకపోతే విద్యార్థుల భవిష్యత్తు తీవ్రంగా దెబ్బతింటుందని హెచ్చరించారు. ఈ సమస్య పరిష్కారం కోసం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు చేపట్టిన 'ఫీజు బకాయి-బీజేపీ లడాయి' నిరాహార దీక్షకు బండి సంజయ్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఆయనకు మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు ఉద్యమిస్తున్నారని తెలిపారు. ఫీజు బకాయిలు చెల్లించే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించే వరకు బీజేపీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తుందని హెచ్చరించారు. భవిష్యత్తులో విద్యార్థుల సమస్యల కారణంగా ఎలాంటి పరిణామాలు ఎదురైనా రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని బండి సంజయ్ స్పష్టం చేశారు. యూపీఐకి పదేళ్ల మైలురాయి సందర్భంగా స్నేహితులతో కలిసి కరీంనగర్‌లో కేంద్ర మంత్రి చాయ్ తాగుతూ వేడుక జరుపుకున్నారు.
ఈ సందర్భంగా చాయ్ బిల్లు కూడా యూపీఐ ద్వారానే చెల్లించారు.

# ఫీజుల బకాయిలపై ఈటల ఫైర్

## విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలొద్దు



ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల అంశంపై సీఎం రేవంత్‌రెడ్డిపై మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. లక్షలాది మంది పేద విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని ఆరోపించారు. ఫీజులు వస్తాయన్న నమ్మకంతో కూలీలు, ఆటోడ్రైవర్లు, రైతులు, చిరు వ్యాపారులు తమ పిల్లలను కాలేజీల్లో చేర్పించారని, ఇప్పుడు బకాయిలు చెల్లించకపోతే వారి పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఫీజులు అందక కాలేజీలు సిబ్బంది జీతాలు కూడా చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. పేద పిల్లలకు నాణ్యమైన విద్య అందించడమే ఫీజు రీయింబర్స్‌మెంట్ లక్ష్యమని గుర్తుచేశారు. భూముల అమ్మకాల ద్వారా వేల కోట్ల రూపాయలు సమకూరుతున్నాయని చెబుతున్న ప్రభుత్వం విద్యార్థుల ఫీజులు చెల్లించడానికి ఎందుకు ముందుకు రావడం లేదని నిలదీశారు. తెలంగాణ సమాజం తమ పాలనపై ప్రశ్నలు వేస్తోందని ఈటల వ్యాఖ్యానించారు.

**రామచందర్‌రావు దీక్షకు బీజేపీ మద్దతు**

ఫీజు బకాయిల కోసం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు చేపట్టిన దీక్షకు ఈటల రాజేందర్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. విద్యార్థి ఉద్యమాల్లో అనుభవం ఉన్న రామచందర్‌రావు సమస్యను అర్థం చేసుకుని పోరాటం చేస్తున్నారని చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పూర్తిగా చెల్లించే వరకు బీజేపీ పోరాటం ఆపబోదని స్పష్టం చేశారు. విద్యతోనే సామాజిక సమానత్వం సాధ్యమని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే రూపుదిద్దుకుంటుందని అన్నారు. తెలంగాణ విద్యార్థులు దేశవ్యాప్తంగా ఉన్నత స్థానాల్లో నిలుస్తున్నారని, ఇక్కడి విద్యార్థుల ప్రతిభకు ప్రపంచస్థాయిలో గుర్తింపు ఉందని పేర్కొన్నారు. ఆక్స్‌ఫర్డ్, లండన్ వంటి సంస్థలు రావడం కంటే ముందుగా స్థానిక విద్యార్థుల చదువుకు ప్రభుత్వం అండగా నిలవాలని డిమాండ్ చేశారు. రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు, పేద కుటుంబాల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవాలని కోరారు. తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేసి మరో ఉద్యమానికి అవకాశం లేకుండా చూడాలని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు.




# జెన్‌జీని తక్కువ అంచనా వేయొద్దు!

## జీవో 97పై హరీశ్ రావు ఫైర్

తెలంగాణలో పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళనపై బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. 20 రోజులుగా విద్యార్థులు జీవో 97 రద్దు కోసం పోరాడుతున్నారని, వారి ఆందోళనకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. మాసబ్‌ట్యాంక్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులను కలిసిన హరీశ్‌రావు.. పాలిటెక్నిక్ కళాశాలలను ఐటీఐలతో కలిపి స్కిల్ యూనివర్సిటీకి అప్పగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. రాష్ట్రంలోని 113 పాలిటెక్నిక్ కళాశాలల్లో 59 ప్రభుత్వ కళాశాలలను ప్రైవేటు విధానంలోకి తీసుకెళ్లే ప్రయత్నం వల్ల లక్ష మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని అన్నారు. ప్రస్తుతం తక్కువ ఫీజుతో పాలిటెక్నిక్ చదివి, ల్యాటరల్ ఎంట్రీ ద్వారా ఇంజినీరింగ్‌లో చేరే అవకాశం ఉందని, కొత్త విధానంతో ఆ అవకాశం కోల్పోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఫీజులు పెరగవని, ఫీజు రీయింబర్స్‌మెంట్ కొనసాగుతుందని ప్రభుత్వం ఎలా హామీ ఇస్తుందో చెప్పాలని ప్రశ్నించారు.

**సెప్టెంబర్ 7లోపు జీవో రద్దు చేయాలి**

విద్యార్థుల ఉద్యమాన్ని ప్రభుత్వం తక్కువగా అంచనా వేయొద్దని హరీశ్‌రావు హెచ్చరించారు. జెన్‌జీ కేవలం రీల్స్, వీడియోలకే పరిమితం కాదని.. అవసరమైతే తమ భవిష్యత్తు కోసం రోడ్డెక్కి పోరాడే శక్తి ఉందని వ్యాఖ్యానించారు. ఢిల్లీ జంతర్‌మంతర్ ఉద్యమాన్ని ప్రస్తావిస్తూ తెలంగాణలోనూ విద్యార్థుల పోరాటం ఉధృతమయ్యే అవకాశం ఉందన్నారు. విద్యార్థులపై పోలీసుల వ్యవహారశైలిని కూడా ఆయన తప్పుబట్టారు. సెప్టెంబర్ 7న అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యేలోపు జీవో 97ను రద్దు చేయాలని, లేకపోతే లక్ష మంది విద్యార్థులతో సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అవసరమైతే బీఆర్ఎస్ తరపున తానే ముందుండి పోరాడతానని ప్రకటించారు. పాలిటెక్నిక్ విద్యను ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై రాజకీయ విమర్శలు చేస్తూ.. ఈ ప్రభుత్వానికే గ్యారెంటీ లేదని మాట్లాడుతున్న నేతలు విద్యార్థుల భవిష్యత్తుకు ఎలా గ్యారెంటీ ఇస్తారని ప్రశ్నించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించకుండా కమిటీల పేరుతో కాలయాపన చేయొద్దని రేవంత్‌రెడ్డికి సూచించారు.




# నకిలీ డిగ్రీలతో వైద్యం

- ప్రాణాలతో చెలగాటం
- నగరంలో ఫేక్ డాక్టర్ దందా

హైదరాబాద్‌లో వైద్యం పేరుతో జరుగుతున్న మరో మోసం కలకలం రేపుతోంది. డాక్టర్ చదువు లేకపోయినా.. చేతిలో నకిలీ డిగ్రీ ఉంటే చాలు.. క్లినిక్ పెట్టి వైద్యం చేసే స్థాయికి కొందరు మోసగాళ్లు చేరుకున్నారు. ఇతర రాష్ట్రాల్లోని ప్రముఖ విశ్వవిద్యాలయాల పేర్లను ఉపయోగించి నకిలీ సర్టిఫికెట్లు తయారు చేసుకోవడం.. వాటిని నిజమైన విద్యార్హతలుగా చూపించడం.. ఆ తర్వాత జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో క్లినిక్‌లు ఏర్పాటు చేయడం ఈ ముఠా వ్యవహారంలో కీలకంగా కనిపిస్తోంది. రోగి క్లినిక్‌కు వెళ్లగానే అనుభవం ఉన్న వైద్యుడిలా వ్యవహరిస్తూ సమస్యను తెలుసుకుని మందులు రాస్తారు. అవసరం లేకపోయినా సెలైన్లు, ఇంజక్షన్లు, వివిధ మందులు ఇస్తూ డబ్బులు వసూలు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వైద్య విద్యపై అవగాహన లేని సాధారణ ప్రజలు తెల్లకోటు చూసి డాక్టర్ అని నమ్మడం వీరికి ప్రధానంగా ఉపయోగపడుతోంది. కొందరు పారామెడికల్ కోర్సులను ఆధారంగా చేసుకుని తమను వైద్యులుగా ప్రచారం చేసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. తాజాగా హైదరాబాద్‌లో 11 మంది పట్టుబడటంతో నకిలీ వైద్యుల దందా ఎంత లోతుగా ఉందనే ప్రశ్నలు తెరపైకి వచ్చాయి.

**11 మంది అరెస్ట్**

జూబ్లీహిల్స్, సికింద్రాబాద్ జోన్లలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్‌లో 11 మంది నకిలీ వైద్యులను అరెస్ట్ చేశారు. నకిలీ డిగ్రీ సర్టిఫికెట్లతో క్లినిక్‌లు నిర్వహిస్తూ అర్హత లేకుండానే అల్లోపతి వైద్యం చేస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. పట్టుబడిన వారి నుంచి మందులు స్వాధీనం చేసుకున్నారు. ఓ మహిళ పారామెడికల్ కోర్సు పూర్తి చేసి అనుమతులు లేకుండా నాలుగేళ్లుగా క్లినిక్ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ప్రస్తుతం ఈ వ్యక్తులు ఏయే ప్రాంతాల్లో క్లినిక్‌లు నడిపారు.. ఏ విశ్వవిద్యాలయాల పేర్లతో నకిలీ సర్టిఫికెట్లు తయారు చేశారు.. ఎంతమంది రోగులకు వైద్యం అందించారు అనే అంశాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అర్హత ఉన్న వైద్యుడిని గుర్తించకుండా చికిత్స తీసుకోవడం ప్రమాదకరమని అధికారులు హెచ్చరిస్తున్నారు.

# ఏడాదిలో దేవాదుల పూర్తి

## మంత్రి ఉత్తమ్, పొంగులేటి రివ్యూ

◆ **రైతులకు నీరందించడమే లక్ష్యం**

దేవాదుల ప్రాజెక్టును ఏడాదిలోగా వందశాతం పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జలసౌధలో జరిగిన సమీక్షలో దేవాదుల ప్రాజెక్టు పనుల పురోగతిపై చర్చించారు. ప్రాజెక్టు ప్రారంభం నుంచి ఇప్పటివరకు జరిగిన పనులను సమగ్రంగా పరిశీలించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఎక్కడ పనులు నిలిచిపోయాయి? వాటికి కారణాలేంటి? సమస్యలను పరిష్కరించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి? అనే అంశాలను పాయింట్‌వారీగా గుర్తించాలని సూచించారు. సమస్యలను గుర్తించకుండా పనులు పూర్తవుతాయని చెబుతూ కాలయాపన చేయడం సరికాదని స్పష్టం చేశారు. ప్రతి సమస్యకు పరిష్కారం, బాధ్యత వహించే అధికారి, పూర్తి చేయాల్సిన గడువు ఖరారు చేయాలని ఆదేశించారు.

**స్పష్టమైన కార్యాచరణతో పనులకు వేగం**

భూసేకరణ, అనుమతులు, నిర్మాణ పనులు, నిధులు, కాంట్రాక్టు సంస్థలకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని పొంగులేటి సూచించారు. ప్రభుత్వం, అధికారులు, ఇంజినీర్లు, కాంట్రాక్టు ఏజెన్సీలు సమన్వయంతో పనిచేస్తేనే నిర్ణీత సమయంలో ప్రాజెక్టు పూర్తవుతుందని తెలిపారు. దేవాదుల ప్రాజెక్టుపై పూర్తి అవగాహన ఉన్న అధికారులతో ప్రారంభం నుంచి ముగింపు వరకు సమగ్ర సమీక్ష నిర్వహించి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆ ప్రణాళికను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. సమస్య ఎక్కడ ఉందో ముందుగా గుర్తించి, కారణాన్ని విశ్లేషించి, పరిష్కారం ఖరారు చేసి అమలు చేయాలని చెప్పారు. ఫలితం వచ్చే వరకు నిరంతర పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. దేవాదుల పూర్తి విషయంలో ఎలాంటి కాలయాపనకు తావులేదని మంత్రి తేల్చిచెప్పారు.



# రేవంత్, పొంగులేటిలకు రియల్ ఎస్టేట్ తెలుసు

- మాకు ప్రజల కోసం పోరాటాలు చేయడం తెలుసు
- 22 ఏ భూముల పరిష్కారానికి సెప్టెంబర్ 7 డెడ్‌లైన్
- లేకుంటే లక్షలాది మందితో అసెంబ్లీ ముట్టడిస్తాం
- సర్కారుకు హరీశ్ రావు వార్నింగ్

బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు 22ఏ నిషేధిత భూముల సమస్యపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తీవ్రంగా ప్రశ్నించారు. కుత్బుల్లాపూర్‌లో ఎమ్మెల్యే కేపీ వివేకానంద ఆధ్వర్యంలో 22ఏ భూముల బాధిత కుటుంబాలతో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఆయన.. బాధితుల సమస్యలు పరిష్కరించకపోతే సెప్టెంబర్ 7 తర్వాత లక్షలాది మందితో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి 98 శాతం భూములను 22ఏ జాబితా నుంచి తొలగించామని చెప్పడం వాస్తవాలకు దూరంగా ఉందని విమర్శించారు. నిజంగా సమస్య పరిష్కారమైతే వందలాది బాధితులు తమ గోడు చెప్పుకోవడానికి ఎందుకు వస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వ తప్పిదంతో భూములు నిషేధిత జాబితాలో చేరితే.. వాటిని తొలగించేందుకు సామాన్యులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఎందుకు రావాలని నిలదీశారు.

**లంచాల ఆరోపణలపై తీవ్ర విమర్శలు**

దశాబ్దాల క్రితం ఏర్పడిన కాలనీల్లోని పట్టా భూములు కూడా 22ఏ జాబితాలో చేరడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని హరీశ్‌రావు ఆరోపించారు. భూముల సమస్య పరిష్కారానికి లంచాలు వసూలు చేస్తున్నారంటూ బాధితులు చెబుతున్నారని పేర్కొన్నారు. 22ఏ వ్యవహారం వెనుక భారీ కమీషన్ల బాగోతం ఉందంటూ సంచలన ఆరోపణలు చేశారు. రేవంత్‌రెడ్డి, పొంగులేటిలకు రియల్ ఎస్టేట్ వ్యవహారాలు తెలిసి ఉండొచ్చని.. కానీ తమకు ప్రజల కోసం పోరాటాలు చేయడం తెలుసని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ భూములు, హెచ్ఎండీఏ, టీజీఐఐసీ, హౌసింగ్ బోర్డు భూములతో పాటు పార్కులపై కూడా ప్రభుత్వం దృష్టి పెట్టిందని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ భూములు కూడా 22ఏ జాబితాలో ఉన్నాయని పేర్కొంటూ, ఈ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

**శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్**

22ఏ నిషేధిత భూముల జాబితాను ప్రజలకు అందుబాటులో ఉంచకుండా వెబ్‌సైట్‌లో ఎందుకు బ్లాక్ చేశారని హరీశ్‌రావు ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. భూములను నిషేధిత జాబితాలో చేర్చడానికి కారణాలు, తీసుకున్న నిర్ణయాలపై సమగ్ర విచారణ జరగాలని కోరారు. బీఆర్ఎస్ పోరాటాల కారణంగానే ప్రభుత్వం కొంతమేర స్పందిస్తోందని ఆయన అన్నారు. ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 7న అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన వెంటనే 22ఏ బాధితుల తరఫున సభను స్తంభింపజేసే స్థాయిలో పోరాటం చేస్తామని హరీశ్‌రావు హెచ్చరించారు. నిషేధిత భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే వరకు బాధితుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

# హిజాబ్ మతపరమైన హక్కు కాదు

- అలహాబాద్ హైకోర్టు సంచలన తీర్పు
- పాఠశాలల్లో యూనిఫామ్‌కే ప్రాధాన్యం



ముస్లిం మహిళలు ధరించే హెడ్‌స్కార్ఫ్ ఇస్లాంలో అత్యవసర మతాచారం అని నిరూపితం కాలేదని అలహాబాద్ హైకోర్టు స్పష్టం చేసింది. ప్రయాగ్‌రాజ్‌లోని టాగోర్ పబ్లిక్ స్కూల్‌లో 11వ తరగతి చదువుతున్న ఓ ముస్లిం విద్యార్థిని, నిర్దేశించిన యూనిఫామ్‌తో పాటు హిజాబ్ ధరించేందుకు అనుమతి కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. జస్టిస్ జె.జె. మునీర్, జస్టిస్ ఇంద్రజీత్ శుక్లాతో కూడిన ధర్మాసనం ఆగస్టు 21న ఈ ఉత్తర్వులు జారీ చేసింది. హెడ్‌స్కార్ఫ్ ధరించకపోతే మత విశ్వాసం నుంచి వ్యక్తి బయటపడతారని నిరూపించే ఆధారాలు పిటిషన్‌లో లేవని కోర్టు పేర్కొంది.

### వ్యక్తిగత అలవాటుతో యూనిఫామ్ మారదు

తాను ఆరో తరగతి నుంచి అదే పాఠశాలలో హిజాబ్ ధరిస్తున్నానని విద్యార్థిని కోర్టుకు తెలిపింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, ఆర్టికల్ 19(1)(a) కింద తన హక్కులు రక్షించబడాలని వాదించింది. అయితే గతంలో పాఠశాల అనుమతించిందన్న కారణంతో ఇప్పుడు యూనిఫామ్ నిబంధనలను మార్చాలని బలవంతం చేసే హక్కు ఏర్పడదని హైకోర్టు స్పష్టం చేసింది. అదే పాఠశాలలోని ఇతర ముస్లిం బాలికలు కూడా హెడ్‌స్కార్ఫ్ ధరించడం లేదని కోర్టు గమనించింది. గతంలో బాంబే హైకోర్టు, కర్ణాటక హైకోర్టు ఇచ్చిన హిజాబ్ సంబంధిత తీర్పులను కూడా అలహాబాద్ హైకోర్టు పరిశీలించింది. హిజాబ్ ధరించడం అత్యవసర మతాచారం కాదన్న అభిప్రాయాలను తన తీర్పుకు ఆధారంగా తీసుకుంది.

### మత స్వేచ్ఛ కాదు.. డ్రెస్ కోడ్ వివాదం

ఈ వ్యవహారం ప్రధానంగా మత స్వేచ్ఛపై ఆంక్షల సమస్య కాదని, పాఠశాల డ్రెస్ కోడ్ అమలు అంశమని హైకోర్టు తేల్చింది. విద్యార్థుల మత విశ్వాసాలను పాఠశాల అడ్డుకోవడం లేదని, అందరూ ఒకే విధమైన యూనిఫామ్ ధరించాలన్నదే సంస్థ నిబంధన అని పేర్కొంది. వ్యక్తిగత కారణాలతో ఒక్కో విద్యార్థికి యూనిఫామ్‌లో మార్పులు అనుమతిస్తే 'యూనిఫామ్' అనే భావనకే అర్థం ఉండదని కోర్టు వ్యాఖ్యానించింది. పాఠశాల క్రమశిక్షణపై తుది నిర్ణయం సంస్థ వద్ద ఉండాలని స్పష్టం చేసింది. ఈ తీర్పుతో విద్యాసంస్థల్లో మతపరమైన దుస్తులు, సంస్థాగత డ్రెస్ కోడ్ మధ్య సమతుల్యతపై మరోసారి చర్చ మొదలయ్యే అవకాశం ఉంది.

# తెలంగాణ మోడల్‌తో కులాల లెక్కింపు

- ప్రశ్నావళిపై రాహుల్, ఖర్గే అభ్యంతరం



జనగణనలో కులగణన విధానం సరిగా లేదని కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ అంశంపై ప్రధాని నరేంద్ర మోదీకి మంగళవారం ఇద్దరూ సుదీర్ఘ లేఖ రాశారు. కులగణనలో తెలంగాణ మోడల్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కులాల నమోదుకు కేంద్రం ప్రతిపాదించిన 'ఓపెన్ ఎండెడ్' విధానం గందరగోళానికి దారితీస్తుందని పేర్కొన్నారు. ఒకే కులం వేర్వేరు పేర్లతో నమోదు అయితే లక్షల సంఖ్యలో కులాల పేర్లు నమోదయ్యే అవకాశం ఉందని, అప్పుడు అసలు లెక్కింపు డేటా ఉపయోగం లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రశ్నావళిలో 'వెనుకబడిన వర్గాలు' అనే పదం లేకపోవడాన్ని కూడా తప్పుబట్టారు. ఎస్సీ, ఎస్టీలకు ఉన్న విధంగానే బీసీ, ఓబీసీలకు కూడా 'డ్రాప్‌డౌన్ జాబితా' విధానాన్ని అమలు చేయాలని సూచించారు.

### తెలంగాణ, బిహార్ నమూనాలు ప్రధానికి

కులగణన కోసం తెలంగాణలో 2024లో, బిహార్‌లో 2022లో ఉపయోగించిన కులాల జాబితా నమూనాలను రాహుల్ గాంధీ, ఖర్గే ప్రధానికి పంపించారు. ప్రస్తుత ప్రశ్నావళిని వెంటనే రద్దు చేసి కొత్త ప్రశ్నావళిని రూపొందించాలని వారు డిమాండ్ చేశారు. ఇందుకోసం అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, నిపుణులతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. కులాల లెక్కింపు కచ్చితంగా జరిగితేనే సామాజిక, ఆర్థిక పరిస్థితులపై సరైన సమాచారం లభిస్తుందని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. మరోవైపు కులగణన అంశాన్ని రిజర్వేషన్లు, సామాజిక న్యాయంతో ముడిపెడుతూ కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేస్తోంది. కులాల సంఖ్యకు అనుగుణంగా విధానాలు రూపొందించేందుకు ఖచ్చితమైన డేటా అవసరమని కాంగ్రెస్ వాదిస్తోంది.

### 8.2 లక్షలకు పైగా పోస్టులు ఖాళీ

కేంద్ర ప్రభుత్వ శాఖల్లో భారీగా ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని మల్లికార్జున ఖర్గే విమర్శించారు. 2015లో కేంద్ర ప్రభుత్వ శాఖల్లో భర్తీ కాని పోస్టులు 4.21 లక్షలు ఉండగా, 2024 నాటికి ఆ సంఖ్య 8.24 లక్షలకు చేరిందని తెలిపారు. రైల్వేల్లో 2.40 లక్షలు, కేంద్ర హోంశాఖ పరిధిలో 1.10 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. రక్షణ రంగంలో కూడా 2.41 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో 5.1 లక్షల శాశ్వత ఉద్యోగాలు రద్దయ్యాయని, కాంట్రాక్ట్ ఉద్యోగాల వాటా 19 శాతం నుంచి 49 శాతానికి పెరిగిందని ఆరోపించారు. ఈ పరిస్థితి ఉపాధి సమస్య మాత్రమే కాదని, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాల సామాజిక న్యాయంతోనూ ముడిపడి ఉందని ఖర్గే అన్నారు. దేశంలో 15 నుంచి 29 ఏళ్ల మధ్య ఉన్న 8.7 కోట్ల మంది యువత చదువు, ఉపాధికి దూరంగా ఉన్నారని నీతి ఆయోగ్ నివేదికను ప్రస్తావించారు. గత 40 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా నిరుద్యోగం పెరిగిందని ప్రియాంక గాంధీ విమర్శించారు.

# ₹13,050 కోట్లు ఇవ్వండి

- ఎయిరిండియాకు నిధుల కొరత
- నడపలేక సంస్థ లబోదిబో
- నష్టాల భారంతో నిధుల వేట



ఎయిర్ ఇండియా పునరుద్ధరణకు టాటా గ్రూప్ చేస్తున్న ప్రయత్నాలకు భారీ నిధుల అవసరం ఏర్పడింది. నష్టాలు పెరుగుతున్న నేపథ్యంలో సంస్థ తన యజమానులు టాటా సన్స్, సింగపూర్ ఎయిర్‌లైన్స్ నుంచి సుమారు ₹13,050 కోట్ల తాజా ఈక్విటీ నిధులు కోరినట్లు రాయిటర్స్ వెల్లడించింది. 2022లో టాటా గ్రూప్ ఎయిర్ ఇండియాను తిరిగి స్వాధీనం చేసుకున్న తర్వాత ఇంత భారీ మొత్తంలో నిధులు కోరడం ఇదే అతిపెద్ద అభ్యర్థనల్లో ఒకటిగా భావిస్తున్నారు. మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ కలిపి సుమారు ₹20,271 కోట్ల నష్టాన్ని నమోదు చేశాయి. గత ఏడాది నష్టాలతో పోలిస్తే ఇది రెట్టింపు కంటే ఎక్కువ. తాజా నిధులను వీలైనంత త్వరగా సమకూర్చాలని సంస్థ కోరుతున్నట్లు సమాచారం. అయితే మొత్తం మొత్తాన్ని ఒకేసారి కాకుండా దశలవారీగా పెట్టుబడి చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఎయిర్ ఇండియాలో సింగపూర్ ఎయిర్‌లైన్స్‌కు సుమారు 25 శాతం వాటా ఉంది. దీంతో తాజా నిధుల సమీకరణలో ఆ సంస్థ పాత్ర కూడా కీలకంగా మారనుంది.

### టర్న్‌అరౌండ్‌కు భారీ ఖర్చులు.. పదేళ్ల సవాల్

ఎయిర్ ఇండియాను లాభాల బాట పట్టించేందుకు టాటా గ్రూప్ భారీ పునరుద్ధరణ కార్యక్రమాన్ని చేపట్టింది. పాత విమానాల ఆధునీకరణ, కొత్త విమానాల నిర్వహణ, సిబ్బంది వ్యవస్థలో మార్పులు, సాంకేతిక మౌలిక వసతుల అభివృద్ధి వంటి అంశాలకు భారీగా ఖర్చు అవుతోంది. మరోవైపు పాకిస్థాన్ గగనతల నిషేధం అంతర్జాతీయ కార్యకలాపాలపై ప్రభావం చూపింది. అంతర్జాతీయ విమాన సర్వీసుల్లో ఏర్పడిన అంతరాయాలు కూడా సంస్థపై ఒత్తిడి పెంచాయి. గత ఏడాది జరిగిన ఘోర విమాన ప్రమాదంలో 260 మంది ప్రాణాలు కోల్పోవడం ఎయిర్ ఇండియాపై మరింత ప్రభావం చూపింది. సంస్థ పునరుద్ధరణ ప్రక్రియకు దాదాపు పదేళ్లు పట్టొచ్చని టాటా సన్స్ చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ గతంలో పేర్కొన్నారు. తాజా నిధుల అభ్యర్థనపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. అయితే రాబోయే సంవత్సరాల్లో కూడా ఎయిర్ ఇండియాకు మరిన్ని మూలధన నిధులు అవసరమయ్యే అవకాశం కనిపిస్తోంది.

# నిన్న పార్టీ.. నేడు కేబినెట్ ప్రక్షాళన

- 12 బెర్తులు.. కొత్త ముఖాలకు ఛాన్స్
- పాతకాపుల శకం ముగియబోతుందా?

## మోదీ 3.0లో భారీగా మార్పులు



బీజేపీ కొత్త జాతీయ కార్యవర్గం పూర్తైన నేపథ్యంలో ఇప్పుడు మోదీ 3.0 కేబినెట్ పునర్వ్యవస్థీకరణపై దృష్టి పడింది. ప్రస్తుతం ప్రధానితో కలిపి కేంద్ర మంత్రివర్గంలో 69 మంది ఉన్నారు. రాజ్యాంగం ప్రకారం గరిష్ఠంగా 81 మందికి అవకాశం ఉండటంతో మరో 12 బెర్తులు ఖాళీగా ఉన్నాయి. 2029 లోక్‌సభ ఎన్నికలతో పాటు అంతకుముందు జరిగే కీలక రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మార్పులు ఉండే అవకాశం ఉందని సమాచారం.

### పార్టీ పదవులు చేపట్టిన వారికి ఉద్వాసన?

బీజేపీ సాధారణంగా ఒక వ్యక్తికి ఒకే పదవి అనే విధానాన్ని అనుసరిస్తుంది. పార్టీ సంస్థాగత బాధ్యతలు చేపట్టిన మంత్రులకు కేబినెట్ నుంచి తప్పుకునే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది. ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడిగా హర్ష్ మల్హోత్రా, ఉత్తరప్రదేశ్ పార్టీ అధ్యక్షుడిగా పంకజ్ చౌధరీ బాధ్యతలు చేపట్టారు. దీంతో వారి స్థానాల్లో కొత్త వారికి అవకాశం రావచ్చని తెలుస్తోంది. స్మృతి ఇరానీ, వినోద్ తావ్డే, సతీష్ పూనియా, తరుణ్ చుగ్ వంటి నేతలకు కూడా సంస్థాగత బాధ్యతలే అప్పగించడం ఈ వ్యూహంలో భాగంగా కనిపిస్తోంది. ఇప్పటికే కేంద్ర మంత్రివర్గంలో మూడు మార్పులు జరిగాయి. పేపర్ లీక్ వ్యవహారంపై యువత నిరసనల నేపథ్యంలో ధర్మేంద్ర ప్రధాన్ విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేశారు. రాజ్యసభ పదవీకాలం ముగియడంతో మైనారిటీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జార్జ్ కురియన్, రైల్వే శాఖ సహాయ మంత్రి రవనీత్ సింగ్ బిట్టూ కూడా పదవుల నుంచి తప్పుకున్నారు. నవంబర్‌లో హర్దీప్ సింగ్ పూరీ, బీఎల్ వర్మల రాజ్యసభ పదవీకాలం కూడా ముగియనుంది. కేబినెట్ మార్పుల్లో రాజకీయ సమీకరణలతో పాటు పనితీరును కూడా పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది. పనితీరు ఆశించిన స్థాయిలో లేని కొందరు మంత్రులకు ఉద్వాసన పలికే అవకాశం ఉందని ఢిల్లీ రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఒకేసారి పలు శాఖలు నిర్వహిస్తున్న మంత్రులపై ఉన్న భారాన్ని తగ్గించేందుకు కూడా శాఖల పునర్విభజన జరిగే అవకాశం ఉంది.

### ఎన్నికల రాష్ట్రాలపై ప్రత్యేక ఫోకస్

కొత్త కేబినెట్‌లో వయసు కూడా కీలక అంశంగా మారవచ్చని సమాచారం. ప్రస్తుతం 70 ఏళ్లు దాటిన కేబినెట్ మంత్రులు, స్వతంత్ర హోదా కలిగిన సహాయ మంత్రులు కనీసం 12 మంది ఉన్నారు. 81 ఏళ్ల జితన్ రామ్ మాంఝీ అత్యంత వయసైన కేబినెట్ మంత్రి కాగా, 38 ఏళ్ల కే. రామ్మోహన్ నాయుడు అత్యంత పిన్న వయస్కుడిగా ఉన్నారు. కొత్తగా యువతతో పాటు మహిళలకు ఎక్కువ ప్రాతినిధ్యం కల్పించే ఆలోచన ఉన్నట్లు తెలుస్తోంది. రాబోయే ఎన్నికలు కూడా కేబినెట్ కూర్పును ప్రభావితం చేయనున్నాయి. ఉత్తరప్రదేశ్, గుజరాత్‌తో పాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్ నుంచి కొత్త ముఖాలకు అవకాశం ఇవ్వడంపై చర్చ జరుగుతోంది. ముఖ్యంగా వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్న ఉత్తరప్రదేశ్ కీలకంగా మారింది.

### మిత్రపక్షాలకు మరిన్ని బెర్తులు

మహారాష్ట్రలో ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనకు 13 మంది ఎంపీల బలం ఉంది. షిండే కుమారుడు శ్రీకాంత్ షిండే పేరు కేబినెట్ బెర్త్ కోసం వినిపిస్తోంది. పంజాబ్‌లో ఆప్ నుంచి బీజేపీ వైపు వచ్చిన ఏడుగురు రాజ్యసభ సభ్యుల వర్గానికి కూడా ప్రాతినిధ్యం కల్పించే అవకాశం ఉంది. పంజాబ్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఈ సమీకరణానికి ప్రాధాన్యం పెరిగింది. పంజాబ్‌లో బీజేపీశిరోమణి అకాలీదళ్ పొత్తు మళ్లీ కుదిరే అవకాశాలపై కూడా చర్చ జరుగుతోంది. 2020లో వ్యవసాయ చట్టాలపై హర్సిమ్రత్ కౌర్ బాదల్ మోదీ కేబినెట్ నుంచి తప్పుకున్నారు. ఇప్పుడు రాజకీయ సమీకరణాలు మారుతున్న నేపథ్యంలో అకాలీదళ్‌కు మళ్లీ కేంద్ర మంత్రివర్గంలో అవకాశం రావచ్చన్న అంచనాలు ఉన్నాయి. పశ్చిమ బెంగాల్‌కు చెందిన తృణమూల్ కాంగ్రెస్ తిరుగుబాటు ఎంపీలకు కూడా ఎన్డీఏలో ప్రాతినిధ్యం కల్పించే అంశం పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. తమిళనాడులో డీఎంకే ఎన్డీఏ వైపు వస్తుందన్న ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. మహారాష్ట్రలో ఎన్సీపీ రెండు వర్గాల పునరేకీకరణ జరిగితే ఆ పార్టీకి కూడా కేంద్రంలో మరింత ప్రాతినిధ్యం కోరే అవకాశం ఉంది.

### 14 మంది మంత్రుల చేతుల్లో అదనపు శాఖలు

కేంద్ర మంత్రివర్గంలో ప్రస్తుతం పలువురు మంత్రులు ఒకటి కంటే ఎక్కువ శాఖలను నిర్వహిస్తున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా హోంశాఖతో పాటు సహకార శాఖను చూస్తున్నారు. జేపీ నడ్డా ఆరోగ్యం, రసాయనాలుఎరువుల శాఖలను నిర్వహిస్తున్నారు. శివరాజ్ సింగ్ చౌహాన్ వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి శాఖలను చూస్తున్నారు. మనోహర్ లాల్ గృహనిర్మాణంపట్టణ వ్యవహారాలు, విద్యుత్ శాఖలను నిర్వహిస్తున్నారు. హెచ్.డీ. కుమారస్వామి భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖలను చూస్తున్నారు. రాజీవ్ రంజన్ సింగ్ 'లలన్ సింగ్' పంచాయతీరాజ్‌తో పాటు మత్స్యశాఖ, పశుసంవర్ధక శాఖలను నిర్వహిస్తున్నారు. ప్రహ్లాద్ జోషి వినియోగదారుల వ్యవహారాలుఆహారం, నూతనపునరుత్పాదక ఇంధనం, విద్యాశాఖలను చూస్తున్నారు. అశ్వినీ వైష్ణవ్ రైల్వేలు, సమాచారప్రసార శాఖ, ఎలక్ట్రానిక్స్ఐటీ శాఖలను నిర్వహిస్తున్నారు. జ్యోతిరాదిత్య సింధియా కమ్యూనికేషన్స్, ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖలను చూస్తున్నారు. గజేంద్ర సింగ్ షెకావత్ సాంస్కృతిక, పర్యాటక శాఖలను నిర్వహిస్తున్నారు. కిరణ్ రిజిజు పార్లమెంటరీ వ్యవహారాలు, మైనారిటీ వ్యవహారాల శాఖలను చూస్తున్నారు. మన్సుఖ్ మాండవీయ కార్మిక, యువజన వ్యవహారాలుక్రీడల శాఖలను నిర్వహిస్తున్నారు. జి. కిషన్ రెడ్డి బొగ్గు, గనుల శాఖలను చూస్తున్నారు. కేబినెట్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఒకే మంత్రి చేతిలో ఉన్న అదనపు శాఖల్లో కొన్నింటిని ఇతరులకు అప్పగించి పనిభారం తగ్గించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

### 2029 లక్ష్యంగా కొత్త టీమ్

కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ కేవలం ఖాళీగా ఉన్న బెర్తులను భర్తీ చేయడానికే పరిమితం కాదన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. 2029 లోక్‌సభ ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని మోదీ ప్రభుత్వం ఇప్పటి నుంచే తన రాజకీయ టీమ్‌ను బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. యువతకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు మహిళలకు మరిన్ని అవకాశాలు కల్పించే అంశం కూడా కీలకంగా మారనుంది. అదే సమయంలో ఎన్నికలు జరగనున్న ఉత్తరప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, పంజాబ్ వంటి రాష్ట్రాలకు కేబినెట్‌లో ప్రాతినిధ్యం పెంచే అవకాశం ఉంది. మిత్రపక్షాల బలాన్ని దృష్టిలో పెట్టుకుని వారికి మరిన్ని బెర్తులు కేటాయించే అంశం కూడా పరిశీలనలో ఉంది. పార్టీ పదవులు చేపట్టిన మంత్రులను సంస్థాగత బాధ్యతలకు పరిమితం చేసి, ప్రభుత్వంలో కొత్త ముఖాలను తీసుకురావడం ద్వారా ఒక వ్యక్తిఒకే పదవి విధానాన్ని మరింత బలపరచాలని బీజేపీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఒకేసారి పలు శాఖలు నిర్వహిస్తున్న మంత్రులపై పనిభారం తగ్గించడం ద్వారా పరిపాలన మరింత సమర్థంగా సాగించే ప్రయత్నం జరగొచ్చు. మొత్తంగా ఈ మార్పులు 2029 ఎన్నికలకు ముందే బీజేపీ రాజకీయ, పరిపాలనా వ్యూహాన్ని కొత్త దిశలో తీసుకెళ్లే కీలక అడుగుగా మారే అవకాశం ఉంది.

## తెలుగు రాష్ట్రాల్లో కేబినెట్ చర్చ

- కొత్త బెర్తులపై నేతల్లో ఉత్కంఠ
- తెలంగాణ, ఏపీలో ఇంకొకరికి ఛాన్స్?

మోదీ 3.0 కేబినెట్‌లో తెలంగాణ నుంచి ప్రస్తుతం జి. కిషన్‌రెడ్డి కేబినెట్ మంత్రిగా, బండి సంజయ్ సహాయమంత్రిగా ఉన్నారు. ఇప్పుడు తెలంగాణకు మరో కేంద్ర మంత్రి పదవి దక్కవచ్చన్న ప్రచారం ఊపందుకుంది. ఆదిలాబాద్ ఎంపీ నగేశ్ పేరు మంత్రి రేసులో వినిపిస్తోంది. అయితే మంత్రి పదవిని ఆశిస్తున్న నేతల జాబితా పెద్దగానే ఉంది. ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్, డీకే అరుణ వంటి సీనియర్ నేతల పేర్లు కూడా రాజకీయ వర్గాల్లో చర్చకు వస్తున్నాయి. దీంతో కేబినెట్ విస్తరణ జరిగితే తెలంగాణ నుంచి ఎవరికి అవకాశం దక్కుతుందన్న అంశం ఆసక్తికరంగా మారింది. ఎంపీల రాజకీయ ప్రాధాన్యం, పార్టీకి చేసిన సేవలు, సామాజిక సమీకరణాలు కీలకంగా మారే అవకాశం ఉంది.

### ఏపీ నుంచి మరో నేతకు అవకాశం?

ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వంలో కింజరాపు రామ్మోహన్ నాయుడు కేబినెట్ మంత్రిగా, పెమ్మసాని చంద్రశేఖర్ సహాయమంత్రిగా, బీజేపీకి చెందిన భూపతిరాజు శ్రీనివాస వర్మ సహాయమంత్రిగా ఉన్నారు. రామ్మోహన్ నాయుడుకు పౌర విమానయాన శాఖ, పెమ్మసానికి గ్రామీణాభివృద్ధి శాఖలో సహాయమంత్రి బాధ్యతలు దక్కగా, శ్రీనివాస వర్మకు భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి బాధ్యతలు లభించాయి. ఇప్పుడు ఏపీ నుంచి కూడా కొత్తగా మరో నేతకు అవకాశం దక్కుతుందా అన్న చర్చ మొదలైంది. ఇద్దరు ముఖ్య నేతలు మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే కేబినెట్ విస్తరణపై తుది నిర్ణయం కేంద్ర నాయకత్వం తీసుకోవాల్సి ఉంది. తెలంగాణ, ఏపీ నుంచి కొత్త ముఖాలకు అవకాశం ఇస్తారా, ప్రస్తుత ప్రాతినిధ్యాన్నే కొనసాగిస్తారా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# యూపీలో ఫ్రీ బస్ స్కీమ్

- ఎన్నికల వేళ యోగి సర్కార్ నిర్ణయం
- 60 ఏళ్ల మహిళలకు బంపర్ గిఫ్ట్
- జీవితాంతం ఉచిత బస్సు ప్రయాణం

ఉత్తరప్రదేశ్‌లో సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం మహిళలకు కీలక నిర్ణయం తీసుకుంది. 60 ఏళ్లు పైబడిన మహిళలకు జీవితాంతం ఉచిత బస్సు ప్రయాణం కల్పించే లోక్‌మాత అహిల్యాబాయి మాతృశక్తి యోజనకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మంగళవారం జరిగిన కేబినెట్ సమావేశంలో మొత్తం 24 ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. ఈ కొత్త పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా కోటికి పైగా మహిళలు ప్రయోజనం పొందనున్నారు. యూపీ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ నిర్వహించే అన్ని బస్సుల్లో ఈ ఉచిత ప్రయాణ సౌకర్యం అందుబాటులో ఉంటుంది. ప్రయాణ సమయంలో ఆధార్, ఓటర్ ఐడీ వంటి చెల్లుబాటు అయ్యే గుర్తింపు కార్డులను చూపిస్తే సరిపోతుంది. మతపరమైన కార్యక్రమాలు, కుటుంబ అవసరాలు, వైద్య సేవలు, ఇతర సామాజిక అవసరాల కోసం ప్రయాణించే వృద్ధ మహిళలకు ఈ పథకం ఆర్థికంగా ఎంతో ఉపశమనం కలిగించనుంది. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని అమలు చేస్తున్నామని రాష్ట్ర రవాణా మంత్రి దయాశంకర్ సింగ్ తెలిపారు. రక్షాబంధన్‌కు ముందు ఈ నిర్ణయం తీసుకోవడంతో దీనిని మహిళలకు ప్రత్యేక కానుకగా ప్రభుత్వం ప్రచారం చేస్తోంది.

### గంగా ఎక్స్‌ప్రెస్‌వేకు భారీ విస్తరణ

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు ఉత్తరప్రదేశ్ కేబినెట్ పలు కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులకు కూడా ఆమోదం తెలిపింది. గంగా ఎక్స్‌ప్రెస్‌వేను హరిద్వార్ వరకు పొడిగించేందుకు రూ.10,761 కోట్ల ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ విస్తరణతో బిజ్నోర్, హరిద్వార్ మధ్య రవాణా మరింత సులభం కానుంది. ప్రయాగ్‌రాజ్ నుంచి హరిద్వార్ వరకు వేగవంతమైన రహదారి అనుసంధానం ఏర్పడి రెండు కీలక కుంభ్ నగరాల మధ్య ప్రయాణ సమయం తగ్గే అవకాశం ఉంది. మరోవైపు సుల్తాన్‌పూర్‌లో పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్‌వే సమీపంలో ఇంటిగ్రేటెడ్ మాన్యుఫ్యాక్చరింగ్ అండ్ లాజిస్టిక్స్ క్లస్టర్ ఏర్పాటుకు రూ.272.25 కోట్లతో ప్రతిపాదనకు ఆమోదం లభించింది. పారిశ్రామిక సంస్థలు, లాజిస్టిక్స్ రంగానికి మెరుగైన వసతులు కల్పించడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. మొత్తంగా మహిళా సంక్షేమంతో పాటు రవాణా, పారిశ్రామిక మౌలిక వసతులకు ప్రాధాన్యం ఇస్తూ యోగి ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది.

# ₹60కి చేరిన ఉల్లి.. ₹70 కి షుగర్

- సామాన్యుడికి ధరల మంట
- ఉల్లి ధరతో మొదలైన భారం



**జీతం వస్తోంది.. కానీ ఇంటికి సరుకులు తీసుకెళ్లేలోపే జేబు ఖాళీ అవుతోంది. మార్కెట్‌కు వెళ్లిన సామాన్యుడికి ఇప్పుడు ప్రతి వస్తువు ఒక షాక్ ఇస్తోంది. ఉల్లిగడ్డ కిలో రూ.60.. చక్కెర కిలో రూ.70 అంటే నిత్యావసరాల ధరలు ఏ స్థాయికి చేరాయో అర్థం చేసుకోవచ్చు. కూరగాయల ధరలు, పప్పుల ధరలు, వంట నూనె ధరలు ఇలా ఒక్కో సరుకు కుటుంబ బడ్జెట్‌ను తినేస్తోంది. ఒకప్పుడు వారానికి సరిపడా సరుకులు కొనుగోలు చేసేందుకు వెళ్లిన కుటుంబాలు ఇప్పుడు అవసరమైన వాటినే ఎంచుకుని కొనాల్సిన పరిస్థితి. పిల్లలకు ఇష్టమైనవి కొనాలన్నా ఆలోచించాల్సిందే. ఇంట్లో వృద్ధుల అవసరాలు తీర్చాలన్నా లెక్కలు వేసుకోవాల్సిందే. ఆదాయం పెరగడం లేదు.. ఖర్చులు మాత్రం ఆగడం లేదు. నెల మొదట్లో వచ్చిన జీతం చివరి వారానికి చేరకముందే ఖర్చైపోతోంది. ధరలు పెరిగితే పేదవాడి పొట్టపై ప్రభావం పడుతుంది.. మధ్యతరగతి కుటుంబం పొదుపుపై ప్రభావం పడుతుంది. ఇప్పుడు రెండూ జరుగుతున్నాయి. మార్కెట్‌కు వెళ్లిన ప్రతిసారీ ధరల మంట కనిపిస్తోంది. అందుకే సామాన్యుడి నోట ఒకటే మాట.. "ఏం తినేట్టు లేదు.. ఏం కొనేట్టు లేదు!"**

### ఏం తినేట్టు లేదు.. ఏం కొనేట్టు లేదు

హైదరాబాద్‌లో ఉల్లిగడ్డ కిలో రూ.60 వరకు పలుకుతుండగా, వంటింటి ఖర్చు సామాన్యుడికి రోజురోజుకూ భారంగా మారుతోంది. దేశవ్యాప్తంగా కూడా ఉల్లి ధరలు భారీగా పెరిగాయి. ఆగస్టు 24 నాటికి సగటు రిటైల్ ధర ఏడాది కాలంలో 59 శాతం పెరిగి రూ.43.53కు చేరింది. గత ఏడాది ఇదే సమయంలో కిలో రూ.27.37గా ఉంది. పండుగలు, వాతావరణ మార్పులు, సరఫరా వ్యవస్థలో అంతరాయాలు, డిమాండ్ పెరుగుదల ఆగస్టుసెప్టెంబర్‌లో ఉల్లి ధరలను ప్రభావితం చేస్తున్నాయి. హైదరాబాద్‌లో మార్కెట్ ధరలు పెరగడంతో ఇంటి బడ్జెట్‌పై నేరుగా ప్రభావం పడుతోంది. ఉల్లి లేకుండా వంట సాగదు.. ధర పెరిగితే కొనకుండా ఉండలేరు. ఇదే ఇప్పుడు సామాన్యుడి పరిస్థితి. రోజువారీ కూరగాయల ఖర్చులోనే పెద్ద భాగం కరిగిపోతోంది.

### చక్కెర నుంచి కూరగాయల వరకు

ఉల్లి ధరలతో ఇబ్బంది పడుతున్న కుటుంబాలకు మరోవైపు చక్కెర కిలో రూ.70 వరకు పలకడం మరింత భారంగా మారింది. టీ, కాఫీ, పిల్లల అవసరాలు, ఇంటి రోజువారీ వాడకంలో చక్కెర తప్పనిసరి కావడంతో ధర పెరుగుదల నేరుగా కుటుంబ ఖర్చులను పెంచుతోంది. ఒకప్పుడు వంద రూపాయలతో సంచీ నిండా సరుకులు వచ్చేవి. ఇప్పుడు అదే డబ్బుతో కొన్ని వస్తువులు మాత్రమే కొనగల పరిస్థితి కనిపిస్తోంది. కూరగాయలు, పప్పులు, నూనె, ఉల్లి, చక్కెర ఇలా ఒక్కో వస్తువు ధర పెరుగుతుండటంతో నెల జీతం వచ్చేలోపే ఇంటి బడ్జెట్ కరిగిపోతోంది. ప్రభుత్వం ధరలను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నా మార్కెట్‌లో సామాన్యుడికి తక్షణ ఉపశమనం కనిపించాల్సి ఉంది. ధరల పెరుగుదలపై మధ్యతరగతి కుటుంబాలు పొదుపులను తగ్గించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

### రూ.35కే ఉల్లి అందించే ప్రయత్నం

ఉల్లి ధరలను అదుపులోకి తెచ్చేందుకు కేంద్రం మహారాష్ట్రలోని నాసిక్ నుంచి ప్రధాన వినియోగ కేంద్రాలకు రైల్వే ర్యాకుల ద్వారా ఉల్లి తరలిస్తోంది. ఈ ప్రత్యేక రవాణాకు 'కందా ఎక్స్‌ప్రెస్' అని పేరు పెట్టారు. ప్రభుత్వం వద్ద ప్రస్తుతం 1.21 లక్షల టన్నుల బఫర్ ఉల్లి నిల్వలు ఉన్నాయి. వీటిని మార్కెట్‌లోకి విడుదల చేసి రిటైల్‌గా కిలో రూ.35కు విక్రయించే చర్యలు చేపట్టింది. తొలుత చెన్నై, మదురై, ఢిల్లీ, ఎర్నాకుళం, గువాహటి వంటి నగరాలకు సరఫరా చేయనున్నారు. అవసరాన్ని బట్టి మరిన్ని ప్రాంతాలకు విస్తరించనున్నారు. అయితే సామాన్యుడికి కావాల్సింది ప్రకటనలు కాదు.. మార్కెట్‌లో తగ్గిన ధరలు. ఉల్లి నుంచి చక్కెర వరకు ప్రతి నిత్యావసర వస్తువు అందుబాటులో ఉండే ధరలో దొరికితేనే కుటుంబాలకు నిజమైన ఉపశమనం. లేదంటే జీతం పెరగకముందే ఖర్చులు పెరిగిపోతూ సామాన్యుడి బతుకు మరింత కష్టంగా మారే ప్రమాదం ఉంది.



## చీరాల ఏరియా ఆసుపత్రి అభివృద్ధి పనుల సమీక్ష

చీరాల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో అభివృద్ధి పనులను వేగవంతం చేసి, అత్యవసర విభాగ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్యతో కలిసి ఆసుపత్రిని పరిశీలించిన కలెక్టర్.. ఓపీ, ఇన్‌పేషెంట్, అత్యవసర, ఆర్థోపెడిక్, పిల్లలు, ప్రసూతి విభాగాల పనితీరును సూపరింటెండెంట్ డాక్టర్ సుభాషిణిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి పరిసరాల్లో సీసీ, బీటీ రోడ్లు, కాంపౌండ్ వాల్ నిర్మాణానికి అవసరమైన అంచనాలను సిద్ధం చేసి ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి పంపాలని ఏపీఎంఎస్ఐడీసీ ఏఈని ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న పాత భవనాలను తొలగించేందుకు అనుమతులు పొందాలని సూచించారు. రోగుల సహాయకుల కోసం ఆసుపత్రి ప్రాంగణంలో మొక్కలు, బెంచీలు, వాకింగ్ ట్రాక్‌తో పార్కును అభివృద్ధి చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఆసుపత్రిలో మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనులు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

## బొకారో ఎక్స్‌ప్రెస్‌లో 11 కేజీల గంజాయి



చీరాల వన్‌టౌన్ పోలీసులు 11 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు యువకులను అరెస్ట్ చేశారు. పార్వతీపురం నుంచి చెన్నైకి రైలు మార్గంలో గంజాయిని తరలిస్తున్న ఇద్దరు యువకులు పోలీసుల తనిఖీలను గమనించి చీరాల రైల్వే స్టేషన్‌లో దిగిపోయినట్లు పోలీసులు తెలిపారు. చెన్నైకి చెందిన బాల శ్యాంప్రసాద్ (19), అరవిందన్ శంకర్ (18) మరో వ్యక్తితో కలిసి పార్వతీపురంలో గంజాయి కొనుగోలు చేసినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. నిందితుల కదలికలపై సమాచారం అందడంతో దండుబాట రోడ్డు టీ జంక్షన్ వద్ద పోలీసులు నిఘా పెట్టారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా 11 కిలోల గంజాయి బయటపడింది. జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో ఈ అక్రమ రవాణా వెలుగులోకి వచ్చింది. కేసును ఎన్‌డీపీఎస్ చట్టం కింద నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. గంజాయి రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపుతామని పోలీసులు హెచ్చరించారు.

## రాచమల్లుకు ఎన్నికల భయం పట్టుకుంది: జబివుల్లా



ప్రొద్దుటూరులో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి వ్యాఖ్యలపై కడప జిల్లా టీడీపీ కార్యదర్శి జాబివుల్లా తీవ్రంగా స్పందించారు. స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ గెలుస్తుందని చెప్పడం వెనుక అభ్యర్థులు దొరక్కపోవడమే కారణమని విమర్శించారు. వైసీపీ పాలనలో నిర్మించని రోడ్లను కూడా తమ ఘనతగా చెప్పుకుంటున్నారని ఆరోపించారు. మార్కెట్ ఖాళీ చేయించడం నుంచి కౌన్సిలర్ల మధ్య విభేదాలు సృష్టించడం వరకు రాచమల్లు వ్యవహారశైలి ప్రజలకు తెలుసన్నారు. ముస్లింలు, బీసీలు, ఇతర వర్గాలకు ఆయన చేసిన మేలు ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. దొంగ రిజిస్ట్రేషన్ల కారణంగా అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించిన జాబివుల్లా, హౌసింగ్ స్కాంపై త్వరలో పూర్తి వివరాలతో మీడియా సమావేశం నిర్వహించి వాస్తవాలను వెల్లడిస్తామని తెలిపారు. ముస్లిం మైనార్టీల సంక్షేమానికి టీడీపీ ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. అమృత్ పథకం పనుల్లో 40 శాతం గత టీడీపీ హయాంలోనే జరిగాయని పేర్కొన్నారు. రానున్న ఎన్నికలు నిజాయితీగా జరుగుతాయని, వైసీపీ ఓటమి మరోసారి ఖాయమని జాబివుల్లా ధీమా వ్యక్తం చేశారు.

## గంజాయి విక్రయదారుడి అరెస్ట్

**▸▸ చాక్లెట్ ప్యాకెట్లలోనూ గంజాయి!**



ప్రొద్దుటూరులో గంజాయి అక్రమ విక్రయాలకు పాల్పడుతున్న వ్యక్తిని వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన పింటు కుమార్ను అదుపులోకి తీసుకున్న పోలీసులు అతడి వద్ద నుంచి మొత్తం 1.280 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఇందులో 1,220 గ్రాముల గంజాయి ఆకులు ఉండగా, మరో 60 గ్రాములను చాక్లెట్ల తరహాలో ప్రత్యేకంగా ప్యాక్ చేసిన 11 ప్యాకెట్లలో గుర్తించారు. సాధారణంగా చాక్లెట్లుగా కనిపించేలా ప్యాక్ చేసి విక్రయించేందుకు సిద్ధం చేసినట్లు పోలీసులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.20 వేలుగా ఉంటుందని అంచనా వేశారు. ఈ కేసు వివరాలను ప్రొద్దుటూరు సబ్‌డివిజన్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఏఎస్పీ విభూ కృష్ణ వెల్లడించారు. యువతను లక్ష్యంగా చేసుకుని మత్తు పదార్థాల విక్రయాలు సాగుతున్నాయా అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని ఏఎస్పీ స్పష్టం చేశారు.

## కాంగ్రెస్ పోలీస్ స్టేషన్‌గా మార్చుకోండి

**▸▸ పోలీసుల తీరుపై భీమయ్య ఆగ్రహం**



రేవల్లి పోలీస్ స్టేషన్ అధికార కాంగ్రెస్‌కు అనుకూలంగా వ్యవహరిస్తోందని మాజీ జడ్పీటీసీ భీమయ్య తీవ్ర విమర్శలు చేశారు. సామాన్యుల పట్ల ఒకలా, అధికార పార్టీ నేతల పట్ల మరోలా పోలీసులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కుటుంబ వివాదాలను ప్రెస్‌నోట్‌ల ద్వారా బహిర్గతం చేసి ఓ కుటుంబాన్ని ఇబ్బందుల్లోకి నెట్టిన పోలీసులు, కాంగ్రెస్ నేతపై నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు వివరాలను మాత్రం ఎందుకు వెల్లడించలేదని ప్రశ్నించారు. పోలీసులు న్యాయవాదులు, న్యాయమూర్తులుగా వ్యవహరిస్తున్నారా అంటూ నిలదీశారు. వివరణ కోరిన సీనియర్ జర్నలిస్ట్ ఫోన్‌కు ఎస్ఐ స్పందించకుండా కాల్ కట్ చేశారని ఆరోపించారు. పోలీసుల పక్షపాత వైఖరిపై ఉన్నతాధికారులు వెంటనే దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని భీమయ్య డిమాండ్ చేశారు.

# నిధుల కోసం గ్రామాల ఎదురుచూపు

## పల్లె పాలనకు పెరుగుతున్న ప్రమాదం



తెలంగాణలో గ్రామపంచాయతీల పరిస్థితిపై ఇప్పుడు రాజకీయ ఆరోపణల కంటే ప్రభుత్వం తక్షణం స్పందించాల్సిన వాస్తవ సమస్యలపై దృష్టి పెట్టాల్సిన అవసరం కనిపిస్తోంది. పంచాయతీ ఎన్నికలు పూర్తయి కొత్త పాలకవర్గాలు వచ్చినా, చాలా గ్రామాల్లో ఆర్థిక సమస్యలు పూర్తిగా తొలగిపోలేదు. గతంలో పెండింగ్‌లో ఉన్న బిల్లులు, పారిశుద్ధ్య నిర్వహణ, వీధి దీపాలు, తాగునీరు, డ్రైనేజీ, సిబ్బంది చెల్లింపులు వంటి అంశాలు గ్రామ పాలనపై ఒత్తిడి పెంచుతున్నాయి. 2026లో కేంద్రం తెలంగాణ గ్రామపంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం కింద రూ.247.94 కోట్ల తొలి విడత అన్‌టైడ్ గ్రాంట్ విడుదల చేసింది. అయినా నిధులు విడుదల కావడం ఒక్కటే పరిష్కారం కాదు. నిధులు ఎక్కడ ఆగుతున్నాయి? ఎవరి వద్ద ఆగుతున్నాయి? గ్రామానికి చేరేలోపు ఎలాంటి ప్రక్రియలు అడ్డంకిగా మారుతున్నాయి? అనే ప్రశ్నలకు ప్రభుత్వం స్పష్టమైన సమాధానం ఇవ్వాలి.

### బకాయిల భారం.. గ్రామాలపై ప్రభావం

గత పాలనలో చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులపై వివాదం ఇంకా పూర్తిగా ముగియలేదు. 2025లో వెలువడిన నివేదికల ప్రకారం మాజీ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు కలిపి సుమారు రూ.1,083 కోట్ల బకాయిలు ఉన్నట్లు అంచనాలు వచ్చాయి. గ్రామాల్లో పారిశుద్ధ్యం, చిన్నపాటి మరమ్మతులు, మొక్కల సంరక్షణ వంటి ప్రాథమిక పనులకు సొంత డబ్బు ఖర్చు చేసినవారు చెల్లింపుల కోసం ఎదురుచూశారన్న ఫిర్యాదులు నమోదయ్యాయి. ఇప్పుడు అసలు ప్రశ్న గత ప్రభుత్వం తప్పా.. ప్రస్తుత ప్రభుత్వం తప్పా అనేది కాదు. పని చేసిన వ్యక్తికి డబ్బు ఎప్పుడు వస్తుంది? గ్రామానికి అవసరమైన పని ఆగకుండా నిధుల ప్రవాహం ఎలా కొనసాగుతుంది? అన్నదే. పాత బకాయిలను రాజకీయ వాదనగా కాకుండా ప్రత్యేక ఆడిట్ చేసి, అర్హత నిర్ధారించి, చెల్లింపులకు కాలపట్టిక ప్రకటించడం ప్రభుత్వ బాధ్యత.

### కేంద్ర నిధులు వస్తున్నా.. అడ్డంకి ఎక్కడ?

గ్రామపంచాయతీల ఆర్థిక సంక్షోభంలో మరో కీలక అంశం కేంద్ర నిధుల విడుదల. 2026 మార్చిలో తెలంగాణకు రూ.247.94 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యాయి. మరోవైపు వినియోగ ధ్రువపత్రాలు, ఆడిట్ నివేదికలు ఆలస్యం కావడంతో సుమారు రూ.1,200 కోట్ల కేంద్ర నిధులు నిలిచిపోయినట్లు జూలై 2026లో నివేదికలు వెల్లడించాయి. అంటే సమస్య కేవలం డబ్బు లేకపోవడమే కాదు.. నిధులు రావడానికి అవసరమైన పత్రాలు, లెక్కలు, ఆడిట్ ప్రక్రియలు కూడా సమయానికి పూర్తి కావడం లేదన్న మాట. దీనిపై పంచాయతీ రాజ్ శాఖ జిల్లా వారీగా వైట్‌పేపర్ విడుదల చేయాలి. ఏ జిల్లాకు ఎంత నిధి వచ్చింది? ఎంత ఖర్చయింది? ఎంత పెండింగ్‌లో ఉంది? ఎన్ని పంచాయతీలకు యూసీలు సమర్పించలేదు? ఈ వివరాలను ప్రజల ముందుంచితేనే జవాబుదారీతనం పెరుగుతుంది.

### కరెంటు బకాయిలతో కొత్త చిక్కు

ఇప్పటికే నిధుల కొరతతో ఇబ్బంది పడుతున్న పంచాయతీలకు విద్యుత్ బకాయిల సమస్య మరో భారంగా మారింది. జూలై 2026 నివేదిక ప్రకారం గ్రామపంచాయతీల విద్యుత్ బకాయిలు సుమారు రూ.1,700 కోట్లకు చేరినట్లు అధికారులు అంచనా వేశారు. ఈ బకాయిలను 15వ ఆర్థిక సంఘం నిధులతో చెల్లించే ప్రతిపాదనపై కొత్తగా ఎన్నికైన సర్పంచులు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇక్కడ ప్రభుత్వం తీసుకోవాల్సిన నిర్ణయం చాలా స్పష్టంగా ఉంది. గ్రామాభివృద్ధి కోసం వచ్చిన డబ్బు మొత్తం ఇతర బకాయిల్లో కలిసిపోతే కొత్త పనులకు నిధులు ఎక్కడి నుంచి వస్తాయి? తాగునీరు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ, వీధి దీపాలు, అంతర్గత రహదారులు వంటి పనులకు కేటాయించిన నిధులను రక్షించే విధానం అవసరం. బకాయిల పరిష్కారానికి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి, అభివృద్ధి నిధులను కాపాడాలి.

### విమర్శ కాదు.. ప్రభుత్వానికి మేల్కొలుపు

గ్రామపంచాయతీ అనేది ప్రభుత్వానికి చివరి మెట్టు కాదు.. ప్రజల ఇంటి గుమ్మానికి కనిపించే మొదటి పాలనా వ్యవస్థ. గ్రామంలో చెత్త తొలగకపోతే ప్రజలు పంచాయతీని ప్రశ్నిస్తారు. వీధి దీపం వెలగకపోతే పంచాయతీపై ఒత్తిడి వస్తుంది. తాగునీరు అందకపోతే సర్పంచ్‌ను నిలదీస్తారు. కానీ పంచాయతీ ఖాతాలో డబ్బు లేకపోతే ఆ సమస్యకు పరిష్కారం ఎవరు చూపాలి? ఇదే ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం ముందున్న అసలు ప్రశ్న. రాజకీయ ఆరోపణలు పక్కన పెట్టి.. బకాయిలను లెక్కించాలి. నిధుల ప్రవాహాన్ని పారదర్శకంగా చూపాలి. గ్రామాల ప్రాధాన్యతలను గుర్తించాలి. ప్రతి పంచాయతీకి కనీస నిర్వహణ నిధి అందేలా వ్యవస్థ రూపొందించాలి. గ్రామ పాలన బలపడితేనే రాష్ట్ర అభివృద్ధి బలపడుతుంది. అందుకే ఇది ఎవరి మీదో నిందలు వేసే కథ కాదు.. ప్రభుత్వం మేల్కొని సమస్యలను పరిష్కరించాలన్న ప్రజల డిమాండ్‌ను ముందుకు తెచ్చే మేల్కొలుపు.



రచయిత
రేణుక వెంకట్, రాష్ట్ర అధ్యక్షురాలు,
మహిళా సర్పంచ్‌ల ఫోరం

## పాలమూరు-రంగారెడ్డి కెనాల్ భూములపై వివాదం

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కెనాల్ పరిధిలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని రేవల్లి మాజీ సర్పంచ్ శివరాం రెడ్డి ఆరోపించారు. నాగపూర్ నుంచి రేవల్లి వైపు వెళ్లే కెనాల్ ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా భూమిని చదును చేసి దుక్కులు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. కెనాల్ నిర్మాణంలో ముంపునకు గురైన రైతుకు ప్రభుత్వం ఇప్పటికే పూర్తి పరిహారం చెల్లించిందని తెలిపారు. అయినప్పటికీ కెనాల్ వెంట ఉన్న భూమిని తిరిగి చదును చేసి సాగు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూములను ఇప్పుడే కాపాడకపోతే భవిష్యత్‌లో ప్రజా అవసరాలకు ఇబ్బందులు తప్పవని శివరాం రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, సంక్షేమ భవనాలు ఇతర ప్రజాప్రయోజన నిర్మాణాలకు భూమి అవసరమైన సమయంలో కొరత ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. కళ్లముందే భూములు ఆక్రమణకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. వెంటనే అధికారులు స్పందించి కెనాల్ భూములను రక్షించాలని డిమాండ్ చేశారు.

## నేరాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు



ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ నేరాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపీఎస్ ఆదేశించారు. మంగళవారం భూత్పూర్ పోలీస్ స్టేషన్‌ను వార్షికంగా తనిఖీ చేసిన ఎస్పీ రికార్డులు, కేసుల దర్యాప్తు, సిబ్బంది పనితీరును సమీక్షించారు. పెండింగ్ కేసుల విచారణను వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందించాలని సూచించారు. జాతీయ రహదారి ఎన్‌హెచ్-44పై ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా నిరంతర నిఘా కొనసాగించాలని ఆదేశించారు. ప్రమాదాలకు అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. రాత్రివేళల్లో గస్తీ పెంచి శాంతిభద్రతలను కాపాడాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రామకృష్ణ, ఎస్ఐ నాగన్న తదితరులు పాల్గొన్నారు.

## ఇరిగేషన్, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి

**ప్రాజెక్టులు, ఆరోగ్య సేవలపై కలెక్టర్ సమీక్ష**

జిల్లాలో కొనసాగుతున్న ఇరిగేషన్ ప్రాజెక్టుల భూసేకరణ, నిర్వాసితుల పునరావాస ప్రక్రియలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొని ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు. మరోవైపు వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ప్రజారోగ్యంపై పలు కీలక సూచనలు చేశారు. ముఖ్యంగా పాముకాటు బాధితులకు పీహెచ్‌సీ స్థాయిలోనే వెంటనే యాంటీ స్నేక్ వెనమ్ అందించి ప్రాథమిక చికిత్స ప్రారంభించాలని స్పష్టం చేశారు. అవసరం లేకుండా బాధితులను ఇతర ఆస్పత్రులకు పంపించవద్దని సూచించారు. గర్భిణుల ఆరోగ్య పరిస్థితిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, హిమోగ్లోబిన్ పరీక్షలను సమర్థంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.



# ఉచిత పథకాలు వద్దు

## ఆర్థిక భారమన్న వెంకయ్య

నెల్లూరు జిల్లా వింజమూరులోని వైఆర్ జూనియర్ కళాశాల స్వర్ణోత్సవ వేడుకల్లో మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు ఉచిత పథకాలపై తన అభిప్రాయాన్ని స్పష్టం చేశారు. ఉచిత పథకాలకు తాను వ్యతిరేకమని కుండబద్దలు కొట్టారు. మహిళలకు ఉచిత బస్సు వంటి పథకాలతో ప్రభుత్వ ఖజానాపై అదనపు భారం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అయినా, గత ప్రభుత్వాలైనా ప్రజలను ఆకట్టుకునేందుకు ఉచిత పథకాలపై ఆధారపడకూడదని సూచించారు.

**విద్య.. వైద్యానికే ఉచితం..** ప్రజలకు ఉచితంగా అందించాల్సింది విద్య, వైద్యం, ఆరోగ్యం వంటి ప్రాథమిక సదుపాయాలేనని వెంకయ్యనాయుడు స్పష్టం చేశారు. పేదలకు మాత్రమే అవసరమైన సంక్షేమం అందేలా విధానాలు రూపొందించాలని సూచించారు. నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం అందితే ప్రజల జీవన ప్రమాణాలు గణనీయంగా మెరుగుపడతాయని అన్నారు. తన రాజకీయ ప్రస్థానాన్ని గుర్తుచేసుకున్న వెంకయ్యనాయుడు.. ఉదయగిరి ప్రాంత ప్రజలు తనను రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించారని తెలిపారు. ఈ ప్రాంత ప్రజల ఆదరణతోనే తాను ఉపరాష్ట్రపతి స్థాయికి ఎదిగానని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ ఆర్థిక, మౌలిక రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని, ప్రపంచ దేశాలకు దీటుగా తన స్థానాన్ని బలోపేతం చేసుకుంటోందని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.



# సారంపల్లి మల్లారెడ్డికి ఘన నివాళులు

సూర్యాపేట జిల్లాలో రైతు సంఘం జాతీయ ఉపాధ్యక్షులు, సీపీఎం రాష్ట్ర సీనియర్ నాయకులు కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి చిత్రపటానికి సీపీఎం పార్టీ, రైతు సంఘం నాయకులు ఘనంగా నివాళులర్పించారు. సీపీఎం పార్టీ మండల కార్యదర్శి కామ్రేడ్ బుర్రి శ్రీరాములు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు మల్లారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి పూలతో నివాళులు అర్పించారు. రైతులు, కార్మికుల సమస్యల కోసం సుదీర్ఘకాలం పోరాడిన మల్లారెడ్డి సేవలను నాయకులు ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు బచ్చలకూర స్వరాజ్యం, రైతు సంఘం మండల అధ్యక్షులు చందా చంద్రయ్య, సీపీఎం మండల కమిటీ సభ్యులు, రైతు సంఘం నాయకులు బోళ్ల కృష్ణారెడ్డి, మండవ వెంకటాద్రి, మల్లారెడ్డి, పార్టీ శాఖ కార్యదర్శి గడ్డం వినోద్, సరికొండ నాగరాజు, గొల్లపూడి కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణే ధ్యేయం: ఎస్పీ సునిత రెడ్డి



ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడం, శాంతిభద్రతలను కాపాడటం, నేరాలను నియంత్రించడమే పోలీసుల ప్రధాన బాధ్యత అని వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి అన్నారు. మంగళవారం అమరచింత పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా సందర్శించిన ఆమె స్టేషన్ ప్రాంగణంలో మొక్క నాటారు. రికార్డులు, లాకప్‌లను పరిశీలించి పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని ఎస్సై స్వాతికి సూచించారు. గంజాయి, మట్కా, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జూరాల డ్యామ్ వద్ద పర్యాటకుల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. నేరాల నియంత్రణకు సీసీటీఎన్ఎస్, టీఎస్-కాప్ వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించాలని తెలిపారు. విధుల్లో ఉండే సిబ్బంది తప్పనిసరిగా హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ గిరిబాబు, సీఐ శివకుమార్, ఎస్సై స్వాతి తదితరులు పాల్గొన్నారు.

# పెళ్లయిన నెలన్నరకే పాలలో నిద్రమాత్రలు..

# ప్రియుడితో రాసలీలలు!

### రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న భర్తపై హత్యాయత్నం

**పోలీసులను ఆశ్రయించిన బాధితుడు**

ఉత్తరప్రదేశ్‌లోని దూకీస్ జిల్లా చిగ్రావ్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ ఘటన వెలుగుచూసింది. పెళ్లయి నెలన్నర కూడా గడవకముందే ఓ మహిళ తన భర్తను మోసం చేస్తూ ప్రియుడితో వివాహేతర సంబంధం కొనసాగించినట్లు ఆరోపణలు వచ్చాయి. భర్త ఆరోపణల ప్రకారం.. ప్రతిరోజూ రాత్రి అతడికి ఇచ్చే పాలలో నిద్రమాత్రలు కలిపేది. పాలు తాగిన అనంతరం భర్త నిద్రలోకి జారుకున్నాక ప్రియుడిని ఇంటికి పిలిపించుకుని అతడితో ఏకాంతంగా గడిపేదని బాధితుడు పోలీసులకు




ఫిర్యాదు చేశాడు. జూన్ 24న మధ్యప్రదేశ్‌లోని బాందర్‌కు చెందిన మహిళను హిందూ సంప్రదాయాల ప్రకారం వివాహం చేసుకున్నానని, పెళ్లయిన కొద్దిరోజులకే ఆమె ప్రవర్తనపై అనుమానం కలిగిందని తెలిపాడు. అనుమానం మరింత బలపడటంతో భర్త భార్యపై నిఘా పెట్టాడు. ఈ క్రమంలో ఆగస్టు 23న భార్య తన ప్రియుడితో కలిసి ఉన్న సమయంలో వారిద్దరినీ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు వెల్లడించాడు. ఒక్కసారిగా భర్త అక్కడికి రావడంతో ఇద్దరూ షాక్‌కు గురయ్యారు. విషయం బయటపడుతుందనే భయంతో అతడిని అడ్డు తొలగించుకోవాలని ప్రయత్నించినట్లు బాధితుడు ఆరోపించాడు. భార్య తన చేతులు, తలను బిగించి పట్టుకోగా.. ఆమె ప్రియుడు గొంతు నులిమేందుకు ప్రయత్నించాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఊపిరాడక గట్టిగా కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు అక్కడికి చేరుకుని తనను రక్షించారని తెలిపాడు. ఈ ఘటన అనంతరం తన భార్య, ఆమె ప్రియుడి నుంచి ప్రాణహాని ఉందంటూ బాధిత భర్త చిగ్రావ్ పోలీసులను ఆశ్రయించాడు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు ఘటనపై దర్యాప్తు ప్రారంభించారు. భార్యకు ప్రియుడితో ఉన్న సంబంధం, భర్తకు నిద్రమాత్రలు ఇచ్చినట్లు చేసిన ఆరోపణలు, ఆగస్టు 23న జరిగిన హత్యాయత్నం తదితర అంశాలపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. పెళ్లయిన కొద్ది రోజులకే చోటుచేసుకున్న ఈ పరిణామాలు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. అయితే కేసులోని ఆరోపణలు దర్యాప్తులో నిర్ధారణ కావాల్సి ఉంది.

రాజ్య సంస్కరణ
బుధవారం, 26.08.2026, మేడ్చల్ మల్కాజిగిరి

# కొవ్వూరి సౌజన్య అనే నేను
# రాస్తున్న మరణ పత్రం







చిన్నప్పటినుంచీ ఒకరితో మాట పడకూడదు, ఏదీ చెప్పించుకోకూడదని నాకు నేనే గీత గీసుకుని బాగా చదువుకుని అన్ని రంగాల్లో ముందుండేలా Self studylo అన్నీ నేర్చేసుకునేదాన్ని. నా తండ్రి గారు ఎంతో మంచి పేరు, మర్యాదలు గల వ్యక్తి. చాలా కష్టజీవి మరియు త్యాగానికి పెట్టింది పేరు. ఆయన నా Hero & role model. ఆయన పరువుకి నా వల్ల చెడ్డ రాకూడదని ఎంతో జాగ్రత్తగా ఉండేదానిని.

2018లో నా జీవిత తోడు, నీడ, నా బెస్ట్ ఫ్రెండ్, నా కష్టాలన్నీ తట్టుకుని నిలబడడానికి కారణమైన వ్యక్తి, నా తమ్ముడు Satishని కోల్పోయాను.

నా కొడుకు RIOకి father attachment అసలు లేదు, అలానే మమ్మల్ని నా భర్త ఎక్కడికీ పెద్దగా పంపేవారు కాదు. only రావులపాలెంలో func tionsకే తీసుకెళ్ళేవారు, అలానే వాళ్ళ పేరెంట్స్, సిస్టర్, కజిన్స్ ఎవరితోనూ కలవనిచ్చేవారు కాదు. పిల్లవాడికి always loneliness ఉండేది. నేనే కాకినాడలో ఒక 2 years బయటకు కొంచెం తిప్పి అన్నీ అలవాటు చేసేదాన్ని.

ఈ Sadhik నా RIOతో చాలా ఆడిస్తూ, enter tain చేస్తూ వాడి నుంచి మా ఇంటి విషయాలు.. నా భర్త ఎక్కువ వుండరు అన్న విషయాలు తెలుసుకునే వాడు. నాకూ ఆశ్రంలో ఉన్న భయానికి నేను ఎవరైనా లాయర్లు కోసం ట్రై చేస్తున్నా అని, నా ఫోన్ విన్నాడు (అకాడమీలో క్లాస్ టైంలో). Slow ga No personals తెలుసుకుంటూ ఇద్దరం ఫ్రెండ్స్ అయ్యాం. అలానే క్లోజ్ అయ్యి, నాకు నా లైఫ్‌కి సపోర్ట్ ఇస్తా అన్నాడు. ఎంతగానో నమ్మాను. కానీ, నన్ను కొన్ని ప్రయివేట్ విషయాలు అడ్డు పెట్టుకుని blackmail చేయడం మొదలు పెట్టాడు. అది నేను ఎదిరించిన ప్రతి సారీ, నన్ను చాలా గట్టిగా కొట్టేవాడు.

నాకున్న భయానికి నేను మెత్తంగా depression లోకి వెళ్ళిపోయా. చాలా సార్లు తట్టుకోలేక చచ్చిపోదాం అనుకున్నా Rioని చూసి ఆగేదాన్ని. అలా సంవత్సరం భరించి, నా భర్తకి చెప్పేశాను, నీ ఆస్తి ఇచ్చేస్తా, అలానే నువ్వు అడిగిన divorce కూడా ఇచ్చేస్తా, నన్ను మాత్రం వాడి నుంచి కాపాడమని, కానీ అతను కూడా ఈ sadhik చేసిన attackతో తీవ్రంగా దెబ్బలు తిని మొత్తంగా భయపడిపోయాడు.

Finally నేను ఇంకా దెబ్బలు తిని తట్టుకోలేక పోయా. చివరికి నన్ను బెదిరించడానికి నా కొడుకు స్కూల్లో కోచ్‌గా చేరిపోయాడు. ఏదైనా తేడా వస్తే అక్కడ్నుంచే వాడిని కిడ్నాప్ చేసి, కనిపించకుండా వీడియో కాల్స్‌తో నన్ను control చేస్తా అనేవాడు. ఏమీ చేయలేని స్థితికి వెళ్ళిపోయా. చావడానికి మార్గాలు కుండా మూసేసేవాడు. దగ్గర్లో ఎప్పుడూ sleeping pills పెట్టుకునేదాన్ని.

అటువంటి టైంలో నా భర్తని world's most dan gerousలో 2nd place లో ఉండే chemical అంట, అది ఇచ్చి చంపేసాడు. దానికి నా కొడుకు ప్రాణం అడ్డుపెట్టాడు. Sadhik ఆ chemical Mumbai, Canada నుంచి తెప్పించాడు. నేను ఎలా అయినా నా భర్తని కాపాడాలని Hyderabad తీసుకువెళితే అక్కడికి కూడా వచ్చేశాడు.

నేను ఎన్నిసార్లు వదిలేయమంటే అన్ని సార్లు నన్ను కొట్టి చంపేసంత పనిచేసేవాడు. నేను నరకం ప్రత్యక్షంగా చూసేదాన్ని. 24/7 phone line లోనే ఉండేవాడు బిజినెస్ వాట్సాప్ ద్వారా. నా ప్రతి ఫోన్ కాల్, ప్రతి స్టెప్ మోనిటర్ చేసేవాడు. వాళ్ళింటికి వెళ్లి కూడా చెప్పాను నా బాధ. వాళ్లు కూడా వీడెక్కడ దొరికాడంటూ బాధపడ్డారు. వాళ్ళ చెల్లి Saliya కూడా చాలా కొట్టాడని చెప్పి నన్ను దూరం ఉండమని హెచ్చరించారు. కానీ వీడి కన్ను నా ఆస్తిపై ఉందని నాకు చాలా ఆలస్యంగా తెలిసింది.

నేను, నా భర్త హాస్పిటల్ లో ఉన్నప్పుడే plan చేసుకున్నాం. కానీ తను చనిపోయాక ఇతను నా మీద మొత్తం కంట్రోల్ తీసుకున్నాడు. నన్ను మా inlaws, ఆడపడుచుకు ఉన్న గొడవలు, వాళ్ళంటే నాకున్న భయాన్ని అడ్డు పెట్టుకుని ఆడించాడు. నా ప్రతీ అడుగు వాడిని అడిగే వేయాలి, ఇప్పటికి నా ఇల్లు వాడి con trolలో మార్చాడు.
ఇంటి తాళం, నా భర్త alternative fold phone, నా fold phone, నా SBI locker keys, నా daddy కష్టార్జితం అయిన ఒక సైటు (స్థలం పనసపాడు దగ్గర) original docu ments ఇవన్నీ అతని కంట్రోల్‌లో పెట్టుకున్నాడు. నాకింక పోరాడే శక్తి లేదు. ఎందుకంటే ఆపరేషన్ 19.8.26న. అది అయిన తరువాత నన్ను ఆ న్యూ ఫ్లాట్లో బంధించేస్తాడంట. దానికి నా తండ్రి అడ్డం వస్తే ఆయన్నీ చంపేస్తా అన్నాడు.. నేను అంత బాధ భరించలేను.

నా తల్లి, తండ్రి, చిన్న బిడ్డ రిస్క్ లోకి వెళ్ళిపోతున్నారు. రోజు రోజుకి పరిస్థితులు దిగజారి పోతున్నాయి. 24/7 phone line లోనే ఉండాలి. చావడానికి కూడా మేము వణికి పోతున్నాం.. నా భర్త చావుకి న్యాయం జరిగి తీరాలి. అందుకే నేను ఇంత పెద్ద నిర్ణయం తీసుకున్నా.

పోలీసులు (SP office gunmen & SP గారు) అందరితో సాదిక్‌కి contacts ఉన్నాయని, నేను పోలీసు డిపార్టుమెంటు దగ్గరకు వెళితే నన్ను వాళ్ళ చేతే దొంగ కేసు పెట్టించి, దొంగ సాక్ష్యాలు AI తో సృష్టించి చంపేస్తా, నా కొడుకుని టెర్రరిస్టులకు అమ్మేస్తా అని తీవ్రంగా బెదిరిస్తున్నాడు.

నా తల్లి తండ్రులు ఈ ప్రెజర్ తట్టుకోలేకపోతున్నారు. ప్రతి రోజు నా కొడుకు ఇంటికి తిరిగొచ్చేవరకు ఈ నీచుడు సాదిక్‌తో నవ్వుతూ ఉండాల్సి వస్తోంది. అది ఇంక మా వల్ల అవ్వదు. నన్ను ఇప్పటికిప్పుడే ISLAM లోకి మారమని రోజు books (ISLAMIC) చదివి, బుక్స్ రాయమని, లేదంటే రోజు టార్చర్ చూపిస్తా అని చంపేస్తున్నాడు.

10 days back 3 రోజులు కొట్టాడు. నన్ను ఉప్పాడకి 16 km దూరం తీసుకు వెళ్లి సముద్రంలో తోసేసాడు. మళ్ళీ వెనక్కిలాగి, ఈ సారి రాళ్ళపై నుంచి తోసేస్తా, మళ్ళీ నన్ను వదలమని మా ఇంటికి వెళ్ళి చెప్పావంటే అని పెద్ద threat ichadu. నా భర్త తోనే నేను వెళ్ళిపోవాలి కానీ చాలా మంది పాపం అప్పులు ఇచ్చిన వాళ్ళు ఉన్నారు. వారందరికీ కొంచెం తీర్చాను. అలానే నా అత్తమామలుకి నా తాలుక స్థిరాస్తిని అప్పజెప్పుతున్నా.

వాడి ఇంట్లో వాళ్ళు కూడా, 'వీడు నా భర్తని చంపాడు అంటే పెద్దగా react కూడా అవ్వలేదు, నేను భయపడ్డా వాళ్ళ ధీమా చూసి. మా సైటు పేపర్లు డీల్ చేసిన భాషా భాయ్ మంచి వ్యక్తి . అతనితో వీడు నన్నూ, నా కొడుకుని మాయ చేసినట్టు కొన్నాళ్ళు డ్రామా చేస్తా అనడం నేను స్వయంగా విన్నా. నేను చచ్చి పోయినా నా కొడుక్కి protection అసలు ఉండదు, అందుకే అందరం కలసి వెళ్ళిపోవాలని నిర్ణయించుకున్నాం.

వాడి క్రూరత్వంకి నేను ఇప్పుడు కూడా phone line లో ఉండగానే ఈ letter రాస్తున్నా అందుకే pen వణికిపోతోంది..

వాడికి ఎందుకు ఎలా కోపం వస్తుందో తెలియదు. కానీ ఆ కోపాన్ని నరకం కన్నా దారుణంగా ఉంటుంది. చిన్నప్పట్నుంచీ దెబ్బ తినడం తెలియని నేను, వీడి చేతిలో ఎంతో క్షోభ అనుభవించా, తట్టుకోలేక పోతున్నా..

చివరగా... Mothers please don't get stressed about extracurricular activi ties of your kids. Sadhik లాంటి Snakes చాలా మంది ఉంటారు. మన పిల్లలే మన weak ness, అన్నీ తెలుసుకుని, దూరి జీవితాలు ఛిన్నాభిన్నం చేసేస్తారు. పిల్లలు చక్కగా జీవితాన్ని అనుభవించాలి. నాకు సంబంధించిన క్రొత్త ఫ్లాట్ కీ వాడి హ్యాండోవర్ లో ఉంది. వాడికి ఒక్క రూపాయి కూడా అందకూడదు. 5 గురి ప్రాణాలు పోవడానికి కారణమైన కర్కోశకుడు.

మేము చావడానికి కూడా వణికిపోతున్నాం. పోలీసులు వాడి దగ్గర training తీసుకుంటారంట. రౌడీలకు ఇల్లీగల్ వెపన్స్ సప్లై చేస్తాడంట. అందుకే నాకు వీడిని తట్టుకోలేమని తెలిసి, ఇలా decide అయ్యా. SBI, ICICIలో నావి, నా తల్లివి, మరియు నా కొడుకు పేరున ఉన్న స్కీమ్స్, బ్యాంకు బాలన్స్, అనాథ శరణాలయాలకు ఇవ్వాల్సిందిగాల ప్రార్ధన.

I thank so many friends, relatives, well wishers. Females are still need to be strong. ఇలాంటి వాళ్ల trap లో పడొద్దు. Islam పేరుతో ఎంతో మోసం జరుగుతోంది.. కృష్ణ పరమాత్ముడు ఎంతో గొప్పవాడు. చివరివరకు నేను నాధర్మాన్ని వదలలేదు. "కృష్ణాయ వాసుదేవాయ హరయే పరమాత్మనే, ప్రణతః క్లేశనాశాయ గోవిందాయ నమో నమః".

Sadhik phones 7032578003, 998 5588939, 6364940760. వాడి కారు కూడా దొంగ కారు.

వాడు గొప్పగా నటిస్తూ, వాడి మతం మునుగులో అక్రమాలు చేస్తున్నాడు.
Address: Two town Police station back streets, beside Jain temple, 2nd floor
వాడి బావ ముబషీర్‌ని కూడా police influence tho ఇరికించాడు, వాడి అక్కతో తప్పుడు డ్రామా ఆడించి, రికార్డుచేసి.

చాలా మంది పిల్లల్ని క్రూరంగా కొడతాడు, కానీ అందరూ. hardwork చేయాలి అని parents తట్టుకుంటారు. కానీ కొంచెం మందిని మాత్రం పేరుకోసం మంచిగా treat చేస్తాడు.

వాడి చేతిలో తిన్న ప్రతి అన్యాయమైన దెబ్బకి దేవుడు వాడికి తగిన శిక్ష వేస్తాడు. వాడింటికి వెళ్ళి వేడుకున్నా నన్ను వదిలేయమని. కానీ అప్పుడు వాళ్ళముందే తన్ని, కొట్టి కడుపులో 'పిడిగుద్దులు గుద్దాడు. 10 రోజులయింది ఇంకా ఆ దెబ్బలు నా వంటిపై వున్నాయి. నాకు నా కొడుకుని చూస్తే చూస్తే భయమేస్తోంది.

ఒక రోజు గడవడం కూడా కష్టంగా ఉంది. వాడికి ఈ నీచుడంటే ఉన్న భయానికి 5 రోజుల నుంచి వాంతులు కడుపునొప్పి, Tension పడిపోతున్నాడు, ఇవన్నీ చూడలేక పోతున్నా..

ఈ నీచుడు పైకి వాళ్ళ మతంలో మంచి వ్యక్తిలా నటిస్తూ, అందరికీ Haram, Halal, Hadees అని క్లాసులు పీకుతాడు. కానీ youtube, facebook, insta multiple accounts maintain చేస్తూ porn చూస్తాడు, theatre do er.. Mov ies Stars చూస్తాడు. Music, songs, థియేటర్లో మూవీస్ కూడా చూస్తాడు.

నా HDFC, అమ్మ ICICI accounts linked phone SIM కూడా వాడి control లోనే వుంది.

ఈ letters scan copy నేను MP UDAY గారికి, MLAs కి, SP గారికి అందరికి అందజేయ ప్రయత్నిస్తున్నా.

ఇలాంటి నీచమైన ముస్లిం వక్తి వల్ల అసలైన ముస్లింలు కూడా ఇబ్బందులు పడుతున్నారు. అందరూ జాగ్రత్త, especially kids, girls, young mothers.

కృష్ణాయ వాసుదేవాయ
హరయే పరమాత్మనే
ప్రణతః క్లేశనాశాయ గోవిందాయ
నమో నమః

ఆఖరి నిమిషం వరకూ
కృష్ణపరమాత్ముని స్మరణలో..

**కనీసం ఇప్పడైనా ఆ మతోన్మాదుల వలలో పడకండి..**
**జీవితాలను నాశనం చేసుకోకండి..**





అసలు సౌజన్య జీవితంలో ఏం జరిగింది? రైఫిల్ షూటింగ్ అకాడమీలో మొదలైన ఒక సాధారణ పరిచయం ఆమె కుటుంబాన్ని ఎందుకు కుదిపేసింది? కుటుంబ సమస్యలు చెప్పుకున్న ఓ మహిళకు అండగా నిలిచిన వ్యక్తి ఎలా ఆమె జీవితంలో కీలకంగా మారాడు? ఆ పరిచయం ప్రేమగా మారిందా? లేక బ్లాక్‌మెయిల్‌కు దారితీసిందా? భర్త జగదీశ్వరరెడ్డి మరణం వెనుక నిజంగానే విషప్రయోగం ఉందా? సౌజన్యపై మతమార్పిడీ ఒత్తిడి తెచ్చాడా? కుటుంబ ఆస్తులు, బ్యాంకు ఖాతాలు, ఫోన్లపై నియంత్రణ తీసుకున్నాడనే ఆరోపణల్లో నిజమెంత? చివరకు ఒక సంపన్న కుటుంబం ఎందుకు గోదావరిలో దూకింది? ఈ ప్రశ్నలకు సమాధానాలు వెదుకుతున్న దర్యాప్తు ఇప్పుడు రాజకీయరంగు పులుముకుంది. ప్రధాన నిందితుడు అరెస్టయ్యాక కూడా వివాదం చల్లారలేదు. మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ఈ ఘటనను 'లవ్ జిహాద్' కోణంలో ప్రస్తావిస్తూ కూటమి ప్రభుత్వాన్ని ఎందుకు నిలదీస్తున్నారు? అదే సమయంలో.. టీడీపీ, బీజేపీ, జనసేన ఈ విషయంపై ఎందుకు స్పష్టంగా స్పందించడం లేదని విజయసాయిరెడ్డి పదే పదే ప్రశ్నిస్తున్నారు. నాటి వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి పేరు ఎందుకు ఈ కేసులో మార్మోగుతోంది. నిందుతుడి సాజిత్‌కు ఆయనకు ఉన్న సంబంధంపై ఎందుకు చర్చ మొదలైంది. పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గానికి చెందిన కుటుంబమే ఈ విషాదానికి గురికావడం రాజకీయ చర్చకు ఎందుకు దారితీసింది? ఒక కుటుంబ విషాదంగా మొదలైన ఈ కేసు... ఇప్పుడు నేరం, మతం, ఆస్తులు, రాజకీయాల మధ్య చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్‌లో అత్యంత చర్చనీయాంశమైన కేసుగా మారింది.




- నాలుగు మరణాలు అంతులేని ప్రశ్నలు
- లవ్ జిహాద్‌కి బలైపోయిన బీసీ కుటుంబం
- సౌజన్య జీవితాన్ని చిన్నాభిన్నం చేసిన జిహాద్ ముఠా గుట్టురట్టు!?

అసలు కథ ఇదే!

# లవ్ జిహాద్

## అతడు సైకో కాదు సాదిక్..!

ఒక సాధారణ పరిచయం.. ఆ తర్వాత సన్నిహిత సంబంధం.. క్రమంగా పెరిగిన అనుమానాలు, ఆరోపణలు, బెదిరింపులు.. చివరకు ఒకే కుటుంబాన్ని గోదావరిలోకి దూకే పరిస్థితికి తీసుకెళ్లిన విషాదం. కాకినాడకు చెందిన సౌజన్య జీవితంలో అసలు ఏం జరిగింది? రైఫిల్ షూటింగ్ శిక్షణ కోసం వెళ్లిన ఆమెకు సాధిక్‌తో పరిచయం ఎలా ఏర్పడింది? ఆ పరిచయం ఏ దశలో వ్యక్తిగత సంబంధంగా మారింది? అక్కడి నుంచి ఆమె జీవితంపై అతని ప్రభావం ఎలా పెరిగింది? కుటుంబ సమస్యలు, భర్తతో విభేదాల గురించి తెలుసుకున్న సాధిక్ ఆ సమాచారాన్ని ఉపయోగించుకున్నాడా? భర్త జగదీశ్వరరెడ్డి మరణం ఈ కథలో మరో కీలక మలుపా? ఆయన మరణంపై వ్యక్తమైన అనుమానాల వెనుక అసలు నిజం ఏమిటి? సౌజన్య తన కుటుంబానికి చెప్పలేని పరిస్థితిలో ఎందుకు చిక్కుకుంది? ఆస్తులు, బ్యాంకు ఖాతాలు, ఫోన్లు, వ్యక్తిగత సమాచారంపై నియంత్రణ సాధించారన్న ఆరోపణల్లో ఎంత నిజం ఉంది?

**• నాలుగు జీవితాలు.. అంతులేని ప్రశ్నలు**

చివరకు సౌజన్య, ఆమె తల్లిదండ్రులు ఎందుకు ఆత్మహత్యకు పాల్పడ్డారు? ఈ ప్రశ్నలకు సమాధానాల కోసం పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఇప్పుడు ఈ కుటుంబ విషాదం రాజకీయ చర్చగా మారింది. మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి 'లవ్ జిహాద్' కోణాన్ని తెరపైకి తీసుకురావడంతో కూటమి ప్రభుత్వంపై ప్రశ్నలు మొదలయ్యాయి. బీజేపీ, టీడీపీ, జనసేన స్పందనపై ఆయన ఎందుకు నిలదీస్తున్నారు? పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలోనే ఈ ఘటన జరగడం ఎందుకు మరింత ప్రాధాన్యం సంతరించుకుంది? అసలు ఇది వ్యక్తిగత నేరమా? వ్యవస్థీకృత కుట్రా? లేక రాజకీయంగా మరో కొత్త మలుపు తీసుకుంటున్న కేసా? సమాధానాల కోసం ఇప్పుడు కాకినాడ నుంచి పిఠాపురం వరకు అందరి చూపు దర్యాప్తుపైనే.

**• ఆత్మహత్యల కేసులో అసలేం జరిగింది?**

కాకినాడ జిల్లాకు చెందిన పంచాయతీరాజ్ శాఖ ఏఈ టిల్లపూడి నూకరాజు కుటుంబం సామూహిక ఆత్మహత్య కేసు రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఆగస్టు 16న రాజమహేంద్రవరం రోడ్డు కమ్ రైల్వే బ్రిడ్జి వద్ద నూకరాజు, ఆయన భార్య మీనా, కుమార్తె సౌజన్య, మనవడు కార్తికేయరెడ్డి గోదావరిలోకి దూకారు. ఈ ఘటనలో నూకరాజు, మీనా, సౌజన్య మృతి చెందగా.. చిన్నారి కార్తికేయరెడ్డి ఈదుకుంటూ బయటపడ్డాడు. మత్స్యకారులు అతడిని రక్షించారు.

ఆత్మహత్యకు ముందు నూకరాజు తన మరణ వాంగ్మూలాన్ని కొందరికి వాట్సాప్ ద్వారా పంపినట్లు పోలీసులు గుర్తించారు. ఆ లేఖలో కాకినాడలో రైఫిల్ షూటింగ్ అకాడమీ నిర్వహించే షేక్ సాధిక్ ఖాన్ వేధింపులే తమ కుటుంబం ఈ నిర్ణయం తీసుకోవడానికి కారణమని పేర్కొన్నట్లు సమాచారం. తన కుమార్తె సౌజన్య, మనవడు ప్రాణాలకు ముప్పు ఉందని నూకరాజు ఆందోళన వ్యక్తం చేసినట్లు కథనం వెలువడింది.

**• రైఫిల్ షూటింగ్ ద్వారా పరిచయం**

సౌజన్య తన కుమారుడు కార్తికేయరెడ్డిని రైఫిల్ షూటింగ్ శిక్షణ కోసం సాధిక్ ఖాన్ నిర్వహించే అకాడమీలో చేర్పించినట్లు దర్యాప్తు వివరాల్లో వెల్లడైంది. అక్కడే సౌజన్యకు సాధిక్‌తో పరిచయం ఏర్పడినట్లు పోలీసులు చెబుతున్నారు. సౌజన్య తన కుటుంబ సమస్యల గురించి మాట్లాడుతున్న సమయంలో సాధిక్ ఆమెకు దగ్గరయ్యాడని, తర్వాత ఆ పరిచయం మరో రూపం దాల్చిందనే ఆరోపణలు ఉన్నాయి. అయితే ఈ సంబంధానికి సంబంధించిన పూర్తి వాస్తవాలు దర్యాప్తులోనే నిర్ధారణ కావాల్సి ఉంది. పోలీసుల ప్రకారం సౌజన్య, సాధిక్ మధ్య సంబంధం ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. సౌజన్యను సాధిక్ బ్లాక్‌మెయిల్ చేశాడని, ఆమెను వేధించాడని, బెదిరించాడని లేఖల్లో ఆరోపణలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఆమెను మతం మార్చుకోవాలని సాధిక్ ఒత్తిడి చేసినట్లు కాకినాడ ఎస్పీ బిందుమాధవ్ వెల్లడించారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించిన ప్రతి అంశాన్ని సాక్ష్యాలతో నిర్ధారించాల్సి ఉందన్నారు.

**• భర్త జగదీశ్వరరెడ్డి మృతి మరో మిస్టరీ**

ఈ కేసులో అత్యంత కీలకమైన మరో అంశం సౌజన్య భర్త జగదీశ్వరరెడ్డి మరణం. తొలుత ఆయన అనారోగ్యంతో మరణించినట్లు భావించినప్పటికీ.. తర్వాత ఆయన మృతిపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. జగదీశ్వరరెడ్డికి సాధిక్ విషపదార్థం ఇచ్చి హత్య చేశాడని కుటుంబ సభ్యుల ఫిర్యాదు ఆధారంగా పోలీసులు మరో కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది. ఈ ఆరోపణ నిజమా? సహజ మరణమా? అనే అంశం పోస్టుమార్టం, ఫోరెన్సిక్ ఆధారాలు, వైద్య రికార్డులతో తేలాల్సి ఉంది. సౌజన్య లేఖలో భర్తకు విషం ఇచ్చిన అంశాన్ని ప్రస్తావించినట్లు పలు కథనాలు వెల్లడించాయి. అయితే విదేశాల నుంచి తెచ్చిన స్లో పాయిజన్, దాన్ని జగదీశ్వరరెడ్డికి ఇచ్చారనే వివరాలు ప్రస్తుతం ఆరోపణల దశలోనే ఉన్నాయి. వాటిని శాస్త్రీయ పరీక్షలు, వైద్య ఆధారాలు నిర్ధారించాల్సి ఉంది.

**ఆస్తుల కోణం ఎందుకు కీలకం?**

కుటుంబం ఆర్థికంగా బలమైనదని, బ్యాంకు ఖాతాలు, లాకర్లు, నగదు, బంగారం, భూములు వంటి ఆస్తులపై సాధిక్ ఆధిపత్యం సాధించాడని ఆరోపణలు ఉన్నాయి. విజయసాయిరెడ్డి ప్రకారం సుమారు రూ.2 కోట్ల బంగారం, రూ.2 కోట్ల నగదు, రావులపాలెంలో రూ.10 కోట్ల విలువైన భూమి, కాకినాడలోని స్థలం, ఇన్సూరెన్స్ క్లెయిమ్ తదితర ఆస్తులపై సాధిక్ కన్నేశాడని ఆరోపించారు. ఈ ఆస్తుల బదలాయింపులు జరిగాయా? జరిగితే ఎలాంటి పత్రాలతో జరిగాయి? అన్నదే ఇప్పుడు దర్యాప్తులో కీలకం కానుంది. సౌజన్య రాసినట్లు ప్రచారంలో ఉన్న లేఖలో తన ఫోన్, బ్యాంకు ఖాతాలు, సిమ్ తదితరాలు సాధిక్ నియంత్రణ ఉన్నట్లు పేర్కొన్నట్లు వార్తలు వచ్చాయి. ప్రైవేట్ ఫొటోలు, వ్యక్తిగత సంభాషణలను అడ్డుపెట్టి బెదిరింపులకు పాల్పడ్డాడనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇవన్నీ నిజమైతే కేసులో సైబర్ క్రైమ్, బ్లాక్‌మెయిల్, ఆస్తి దోపిడీ కోణాలు కూడా కీలకంగా మారనున్నాయి.

